RNI NO .TGTEL/25/A4366

E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: TELANGANA సంపుటి : 01 సంచిక :01 శనివారం 06 డిసెంబర్ 2025 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 08 వెల :05/-

## రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీపై ప్రకటన

## ఈసారి వారందరికీ





తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగానే.. రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలందరికీ సొంతిళ్లు నిర్మించి ఇచ్చే ప్రయత్నం చేస్తోంది. అందుకోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే తొలి విడతలో సుమారు 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం ఇవన్నీ వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. అయితే, పట్టణాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో నిర్మించబోయే ఇళ్లపై కీలక ప్రకటన చేశారు.

రానున్న మూడేళ్లలో పట్టణ ప్రాంతాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని.. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను వచ్చే సంవత్సరం మంజూరు చేస్తామని తెలిపారు. తొలి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 4 లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. వీటిలో వచ్చే ఏడాది మార్చి నాటికి లక్ష ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి.. గృహ ప్రవేశాలు చేయిస్తామన్నారు.

## రూ.100 కోట్ల అవినీతి సామ్రాజ్యం..

### 3 రాష్ట్రాల్లో విస్తరణ.. ఏసీబీకి దొరికిన ల్యాండ్ రికార్డ్స్ ఏడి




తెలంగాణలో ఏసీబీ సిబ్బంది.. మరో అవినీతి అధికారిని అరెస్ట్ చేశారు. ల్యాండ్ రికార్డ్స్ ఏడీగా విధులు నిర్వహిస్తోన్న సదరు ఉద్యోగి ఏకంగా 3 రాష్ట్రాల్లో అక్రమాస్తులను కూడబెట్టుకుని.. రూ.100 కోట్ల మేర సంపాదించాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసులు.. రంగారెడ్డి జిల్లా సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులకు సమాచారం అందడంతో.. వారు సోదాలు నిర్వహించారు.

దీనిలో భాగంగా ఏసీబీ అధికారులు గురువారం నాడు హైదరాబాద్ రాయదుర్గంలోని మైహోం భుజా కమ్యూనిటీలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు ఇంట్లో సోదాలు జరిపారు. అలానే మహబూబ్‌నగర్, హైదరాబాద్, నారాయణపేట జిల్లాల్లో ఉన్న శ్రీనివాసులు బంధువులు, బినామీల ఇళ్లతో పాటుగా.. మొత్తం 7 ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజాము నుంచే ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.

శ్రీనివాసులు విధులు నిర్వహిస్తోన్న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని ఆయన ఆఫీసులో కూడా ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. ఈక్రమంలో ఆయన అక్రమార్జనకు సంబంధించిన కీలక పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో.. రూ.కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, నగదు, కార్లు, వ్యవసాయ భూములతో పాటు ప్లాట్లను కూడా గుర్తించారు. వీటికి సంబంధించిన లెక్కలు చూపడంలో శ్రీనివాసులు విఫలం కావడతో.. ఏసీబీ అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని.. ఆయన మీద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

## సర్పంచ్ బరిలో ఎంఐఎం ఎమ్మెల్యే భార్య..

## ఆ గ్రామమే లక్ష్యంగా బరిలోకి

తెలంగాణ రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగుతోంది. ఇప్పటికే తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉప సంహరణ, ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థుల అధికారిక జాబితా వచ్చేసింది. దీని ప్రకారం తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 395 సర్పంచ్ పదవులు ఏకగ్రీవం అయ్యాయి. ఐదు గ్రామాల్లో అసలు సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు కాలేదు. ఇక తొలి విడత సర్పంచ్, వార్డు మెంబర్లకు సంబంధించి మొత్తం 80 వేల మందికి పైగా అభ్యర్థులు బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయ్యారు. డిసెంబర్ 11 తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

ఇదిలా ఉంటే తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో ఓ ఆసక్తికర సన్నివేశం కనిపించింది. ఎంఐఎం ఎమ్మెల్యే భార్య సర్పంచ్‌గా పోటీ చేస్తున్నారు. ఇంతకు ఆ ఎమ్మెల్యే ఎవరంటే.. ఆయనే హైదరాబాద్, కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గం ఎంఐఎం ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్. ఆయన భార్య నజ్మా సుల్తానా తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సర్పంచ్ పదవికి పోటీ పడుతున్నారు. ఇప్పుడీ విషయం స్థానికంగా ఆసక్తికరంగా మారింది.

ఎంఐఎం ఎమ్మెల్యే మొహియుద్దీన్ స్వస్థలం మెదక్ జిల్లాలోని



వెల్దుర్తి మండలంలో ఉన్న బస్వాపూర్ గ్రామం. సొంత ఊరిలో కొత్తగా ఇల్లు కట్టడంతో.. ఎమ్మెల్యే భార్య నజ్మా సుల్తానా గత కొన్నాళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఈక్రమంలోనే ఆమె సర్పంచ్ బరిలో నిలిచేందుకు ఆసక్తి కనబరిచారు. ఈక్రమంలో గురువారం ఆమె బస్వాపూర్ సర్పంచి అభ్యర్థిగా తన నామినేషన్ సమర్పించారు. ఇదిలా ఉంటే నజ్మా గతంలో హైదరాబాద్‌లో.. నానక్‌నగర్, గోల్కొండ ప్రాంతాల నుంచి 2 సార్లు కార్పొరేటర్‌గా వ్యవహరించారు.

## మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై


### నిజనిర్ధారణకు వెళ్లిన విద్యార్థులు.. ఏపీ, తెలంగాణ బార్డర్‌లో ఉద్రిక్తత




ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దులో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మారేడుమిల్లిలో ఈ నెల 18న జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణ కోసం వెళున్న ఓయూ, కేయూ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థుల బృందాన్ని చింతపల్లి పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు.

గ్రామస్తుల ముసుగులో పోలీసుల నినాదాలు..

కాగా.. సుమారు 20 నుంచి 25 మంది విద్యార్థులు రెండు వాహనాల్లో మారేడుమిల్లి వైపు వెళ్తుండగా, చింతపల్లి-భద్రాచలం రోడ్డులో ఏడుకొండల సమీపంలో పోలీసులు, స్థానిక గిరిజన గ్రామస్థులతో కలిసి బారికేడ్లు వేశారు.



## గోపన్‌పల్లిలో భారీ భూబాంబు

## యజమానులు టెన్షన్‌లో!

- కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఐటీ కంపెనీలకు ఒక్కసారిగా షాక్
- హైకోర్టు ఆదేశాలపై ప్రభుత్వం జారీ చేసిన సంచలన నిర్ణయం
- రిజిస్ట్రేషన్లు నిలిపివేతతో భూస్వాములు, లోన్‌దారులు భయాందోళనలో
- 18 సర్వే నంబర్లు నిషేధిత జాబితాలో - విలువ రూ.27 వేల కోట్ల పైనే
- ప్రభుత్వ శాఖలకే కేటాయించిన భూములు కూడా 22ఏలో - అధికారులు ఆశ్చర్యం
- ఐటీ కారిడార్ మధ్యలో భూములపై పెద్ద వివాదం తెరపైకి
- IGRSలో జాబితా అప్‌లోడ్‌తో శేరిలింగంపల్లి రిజిస్ట్రేషన్లు పూర్తిగా స్టాప్

మిగతా 2 లో

22ఏ జాబితా.. దీని గురించి సామాన్యులకు పెద్దగా తెలియకపోవచ్చు కానీ.. భూముల క్రయవిక్రయాలు జరిపేవారికి 22ఏ జాబితా గురించి బాగా తెలుసు. ప్రభుత్వ నిషేధిత భూములు ఈ జాబితాలో ఉంటాయి. ఒక్కసారి భూములు ఈ జాబితాలో చేరితే వాటిని అమ్మడం, కొనడం చేయలేము. ఇదిలా ఉంటే తాజాగా తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఒకటి, రెండు కాదు.. ఏకంగా 1800 ఎకరాల భూమిని నిషేధిత జాబితా(22ఏ)లో చేరుస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## నరసరావుపేటలో దారుణం

### కడుపులో బ్లేడు వదిలేసిన వైనం



2 లో

ఉమ్మడి గుంటూరు జిల్లా నరసరావుపేటలో వైద్యుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచే అత్యంత దారుణమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఓ మహిళ తీవ్రమైన కడుపునొప్పి కారణంగా స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. ఆ మహిళకు అక్కడి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ క్రమంలో అత్యంత ప్రమాదకరమైన వస్తువును రోగి కడుపులోపలే వదిలేసినట్లు తెలుస్తోంది.

## ప్రిన్సిపల్ బెదిరించాడని..

### పాఠశాల భవనం పైనుంచి దూకిన విద్యార్థి!





చిన్న చిన్న విషయాలకే స్కూల్ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పాఠశాలల్లోనే భవనాలపై నుండి కిందకి దూకుతూ ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇటీవలే ఇలాంటి ఘటనలు దేశంలో రెండు చోటు చేసుకున్నాయి. కాగా తాజాగా అలాంటి ఘటనే మరొకటి చోటు చేసుకుంది. మధ్యప్రదేశ్-రత్లాంలో డోంగ్రే నగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ప్రిన్సిపల్ మందలించాడని 8వ తరగతి విద్యార్థి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు.

## వేతన జీవులకు పండుగలాంటి వార్త..

### వడ్డీ రేట్లను తగ్గించిన ఆర్బీఐ




## ఆఫీసునే బార్‌గా మార్చిన ప్రభుత్వ ఉద్యోగి




## గ్రామంలో విషాదం..

### గుండెపోటుతో సర్పంచ్ అభ్యర్థి మృతి!




### మరో 500 ఇండిగో విమానాలు రద్దు ప్రయాణికుల అవస్థలు.. ఆందోళన




## అర్బన్ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు..


### మంత్రి పొంగులేటి కీలక ప్రకటన




## సీఎం ఆదేశిస్తే రాజీనామాకు సిద్ధం.. ఎమ్మెల్యే దానం సంచలన వ్యాఖ్యలు




### హిల్ట్ పాలసీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు



## ప్రిన్సిపల్ బెదిరించాడని.. పాఠశాల భవనం పైనుంచి దూకిన విద్యార్థి!

మొదటి పేజీ తరువాయి

స్కూల్ కు ఫోన్ తీసుకువచ్చి వీడియోలు తీయడంతో యాజమాన్యం అతడిని మందలించింది.

ప్రిన్సిపాల్ తన గదికి పిలిపించుకుని హెచ్చరించాడు. దీంతో 52 సార్లు విద్యార్థి సారీ చెప్పినట్టు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యింది. మరోవైపు ప్రిన్సిపల్ కెరీర్ నాశనం చేస్తాను అంటూ బెదిరించాడని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. సీసీ టీవీ ఆధారంగా విద్యార్థి ప్రిన్సిపల్ గది నుండి బయటకు వచ్చిన వెంటనే దూకేశాడు. దీంతో వెంటనే విద్యార్థులు, టీచర్లు అక్కడకు చేరుకున్నారు. అతడని ఆస్పత్రికి తరలించగా ప్రాణాపాయం లేదని ప్రస్తుతం కోలుకుంటున్నట్టు వైద్యులు వెల్లడించారు. ఆత్మహత్యయత్నం చేసిన విద్యార్థి జాతీయస్థాయి స్కేటింగ్ క్రీడాకారుడు అని సమాచారం.

## మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు వెళ్లిన విద్యార్థులు.. ఏపీ, తెలంగాణ బార్డర్‌లో ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి

అనంతరం 'మాకొద్దు మావోయిస్టులు.. మాకొద్దు మావోయిస్టులు' అంటూ గ్రామస్తుల ముసుగులో ఉన్న కొందరు (పోలీసులే అని విద్యార్థుల ఆరోపణ) మొహాలకు గుడ్డలు కట్టుకుని విద్యార్థులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే, విద్యార్థుల ఐడీ కార్డులు, వాహనాల పత్రాలు పోలీసులు పరిశీలించి సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో చింతపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మా స్వేచ్ఛను పూర్తిగా హరిస్తున్నారు..

ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. మారేడుమిల్లిలో ఈ నెల 18న జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు తాము ఏపీ సర్కారుతో పాటు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, మావోయిస్టు పార్టీలకు బహిరంగ లేఖ రాశామని తెలిపారు. మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై నిజాలు తెలుసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. కానీ ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి వెళ్లేందుకు చింతపల్లి పోలీసులు అడ్డుకుంటున్నారని.. కాలయాపన చేస్తూ తమను ఎందుకు నిర్బంధించారో చెప్పడం లేదన్నారు. తమ వాహనాలను కూడా స్వాధీనం చేసుకుని తమ స్వేచ్ఛను పూర్తిగా హరిస్తున్నారని మండిపడ్డారు. ఈ వార్తను కవర్ చేసేందుకు వచ్చిన మీడియా మిత్రులను కూడా లోపలికి రానివ్వకపోవడం సోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల ముసుగులో ఉన్న పోలీసులు తమకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

పౌర సమాజం తీవ్రంగా ఖండించాలి

తమకు మావోయిస్టులతో, ఏపీ ప్రభుత్వంతో, తెలంగాణ ప్రభుత్వంతో ఎటువంటి సంబంధాలు లేవని, సాధారణ విద్యార్థులుగా కేవలం మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు వచ్చామని స్పష్టం చేశారు. తమ నిర్బంధాన్ని ఏపీ, తెలంగాణ పౌర సమాజం, మానవ హక్కుల నేతలు, మేధావులు తీవ్రంగా ఖండించాలని.. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు తమకు మద్దతు తెలపాలని విద్యార్థులు పిలుపునిచ్చారు.

## మరో 500 ఇండిగో విమానాలు రద్దు ప్రయాణికుల అవస్థలు.. ఆందోళన

మొదటి పేజీ తరువాయి

సాంకేతిక కారణాలతో ఇండిగో విమానాయాన సంస్థ ప్రయాణికులకు చుక్కలు చూపెడుతోంది. గత మూడురోజులుగా విమాన సర్వీసులను రద్దు చేస్తున్న ఆ సంస్థ.. తాజాగా మరో 500 ఫ్లైట్లను క్యాన్సిల్ చేసింది. వీటిలో ఢిల్లీ నంచి వెళ్లాల్సిన 220, హైదరాబాద్ నుంచి వెళ్లాల్సిన/రావాల్సిన 90 విమానాలు ఉన్నాయి. దీంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు గంటల తరబడి వేచిచూస్తూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇండిగో సిబ్బందిని నిలదీస్తున్నారు. వారు ఏం సమాధానం చెప్పకపోవడంతో ఆందోళనకు దిగారు. తమకు కనీసం తాగు నీరు, ఆహారం ఇవ్వట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విమానాశ్రయంలో స్థలం సరిపోక నేలపైనే నిద్రించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. శబరిమలకు వెళ్లాల్సిన భక్తులది ఇదే పరిస్థితి నెలకొంది. తాము ఇప్పటికే అయ్యప్ప స్వామి స్వామి దర్శనానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నామని, చివరి నిమిషంలో విమానం రద్దు చేయడం ఏంటని ఫైర్ అవుతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ అయ్యప్ప స్వాములు బోర్డింగ్ గేట్‌కు అడ్డంగా బైఠాయించి నిరసన తెలపడంతో ఉద్రిక్తత నెలకొంది.

ఇండిగో షేర్లు ఢమాల్

మూడు రోజులుగా విమానాలు రద్దు చేస్తుండడంతో స్టాక్ మార్కెట్‌లో ఇండిగో షేర్లు భారీగా పతనమవుతున్నాయి. ఈ ఉదయం ట్రేడింగ్‌లో ఇండిగో షేరు ధర 2.16 శాతం తగ్గింది. దీంతో దిద్దుబాటు చర్యలకు ఇండిగో డీజీసీఏను సంప్రదించింది. ఎయిర్‌బస్ ఏ-320 విమానాలకు మినహాయింపు ఇవ్వాలని కోరింది. అయితే, డీజీసీఏ ఇండిగో అభ్యర్థనపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

## అర్బన్ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు.. మంత్రి పొంగులేటి కీలక ప్రకటన

పల్లెల్లోనే కాకుండా అర్బన్ ప్రాంతాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇవాళ ఆయన సచివాలయం లో ఇందిరమ్మ ఇళ్లపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక పేదలకు అనేక కార్యక్రమాలు చేపట్టామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు కేటాయించే బాధ్యత తీసుకుంటున్నామని పొంగులేటి తెలిపారు.

రాబోయే మూడేళ్లలో పల్లెలతో పాటు అర్బన్ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని మంత్రి పొంగులేటి అన్నారు. మధ్య తరగతి కుటుంబాలకు కూడా ఇళ్లు ఇచ్చేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. జీ ప్లస్ త్రీ, జీ ప్లస్ ఫోర్ విధానంలో అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.82 లక్షల ఇళ్ల నిర్మాణం, మూడు రకాల ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వెళ్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## సీఎం ఆదేశిస్తే రాజీనామాకు సిద్ధం.. ఎమ్మెల్యే దానం సంచలన వ్యాఖ్యలు

పార్టీ ఫిరాయింపుల ఫిర్యాదుపై సమాధానం ఇచ్చేందుకు తమకు మరింత గడువు ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను ఇటీవలే ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆయన తన రాజీనామాపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశిస్తే.. ఇప్పటికిప్పుడు రాజీనామా చేసేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఎన్నికల్లో పోటీ చేయడం.. పోరాడటం తనకేమీ కొత్త కాదని కామెంట్ చేశారు. ఇప్పటి వరకు 11 సార్లు ఎన్నికల్లో పోటీ చేశానని అన్నారు. ఎమ్మెల్యేల అనర్హత కేసుపై సుప్రీంకోర్టులో వాదనలు కొనసాగుతున్నాయని తెలిపారు. మరో పదేళ్ల పాటు సీఎంగా రేవంత్ రెడ్డి ఉంటేనే అభివృద్ధి సాధ్యమని దానం నాగేందర్ అన్నారు.

## హిల్ట్ పాలసీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

స్టేట్ పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారిన హిల్ట్ పాలసీపై తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పాలసీపై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వం తెచ్చిన హిల్ట్ పాలసీ జీవో నిబంధనలకు విరుద్ధం అని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, పర్యావరణవేత్త పురుశోత్తం హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. 9,292 ఎకరాల భూకేటాయింపు నిబంధనలకు విరుద్ధమని, ఈ భూకేటాయింపు అంశంపై సీబీఐ లేదా ఈడీతో దర్యాప్తు చేయించాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. రికార్డులు సీజ్ చేసి ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని కోరారు. ఈ పిల్ పై విచారణ జరిపిన న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు ఇస్తూ తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా వేసింది.

## రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీపై ప్రకటన.. ఈసారి వారందరికీ

మొదటి పేజీ తరువాయి

2026, ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ప్రారంభిస్తామని పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు కేటాయించే బాధ్యత తమ సర్కార్‌దే అని మంత్రి స్పష్టం చేశారు. మధ్యతరగతి కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తాజాగా సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్లపై మాట్లాడుతూ ఆయన ఈ ప్రకటన చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ అనేది నిరంతర ప్రక్రియ అని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ సొంతిళ్లు నిర్మించి ఇచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన మరోసారి స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక.. పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఆయన గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని తెలిపారు.

పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి.. జీ ప్లస్ త్రీ, జీ ప్లస్ ఫోర్ విధానంలో ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.82 లక్షల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ అవుతుందని ఆయన చెప్పుకొచ్చారు.

## గోపన్‌పల్లిలో భారీ భూబాంబు - యజమానులు టెన్షన్‌లో!

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ నగరంలోని శేరిలింగంపల్లి మండలంలో ఉన్న గోపన్‌పల్లి రెవెన్యూ గ్రామంలోని 1,800 ఎకరాల భూములను ప్రభుత్వం నిషేధిత జాబితా (22ఏ)లోకి చేర్చింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరిచే ప్రక్రియలో భాగంగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మొత్తం ఈ గ్రామంలో గల భూమిలోని దాదాపు 3వ వంతు భూమిని.. నిషేధిత జాబితాలోకి చేర్చడం సంచలనంగా మారింది.

గత 20 సంవత్సరాలుగా.. ఇక్కడ వెలిసిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు ఉన్న భూమి కూడా ఈ జాబితాలో చేరడంతో వీటి యజమానులు, ఈ భూముల మీద బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నవారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఈ భూములకు సంబంధించి రంగారెడ్డి జిల్లా అధికారులు.. భూ పరిపాలనా ప్రధాన కమిషనర్‌కు లేఖ రాసి.. గోపల్‌పల్లిలోని 18 సర్వే నంబర్లను 22ఏ జాబితాలో చేర్చాలని కోరారు. దీంతో, ఆ భూముల్లో లావాదేవీలను నిలిపివేయాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఐజీఆర్ఎస్ పోర్టల్‌లో ఈ జాబితాను పొందుపరిచారు. ఈ భూముల విలువ సుమారు 27 వేల కోట్ల రూపాయలకు పైమాటే అంటున్నారు.

ఈ నిషేధిత సర్వే నంబర్లలో చేర్చిన భూముల్లో వందలాది ఐటీ కంపెనీలు, ఎకరాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలతో పాటుగా అనేక ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ప్రభుత్వం పలు ఉద్యోగ శాఖలు, ప్రైవేటు సంస్థలకు కేటాయించిన భూములు ఈ నిషేధిత జాబితాలో చేర్చడం గందరగోళంగా మారింది.

గోపన్‌పల్లిలోని 18 వేర్వేరు సర్వే నంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ రికార్డులలో వీటిని ప్రభుత్వ స్థలంగా పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంతో పాటు దేవాదాయ శాఖ, లావాణి పట్టాలు కూడా ఉన్నాయి. రెండు రోజుల క్రితమే శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఈ జాబితా చేరింది. దీంతో ఈ సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లను నిలిపివేసినట్లు సబ్ రిజిస్ట్రార్ తెలిపారు.

గోపన్‌పల్లి రెవెన్యూ గ్రామం.. ఐటీ కారిడార్‌లో భాగంగా ఉంది. ఈ ప్రాంతంలో ఇప్పటికే టీసీఎస్ కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పైగా ఈ గ్రామం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్‌కు సమీపంలో ఉండటంతో ఇక్కడ భూముల విలువ విపరీతంగా పెరిగింది. ఈ ప్రాంతంలో సగటున ఎకరం ధర రూ.150 కోట్లు అనుకుంటే... మొత్తం 1,800 ఎకరాల విలువ బహిరంగ మార్కెట్లో రూ.27 వేల కోట్ల పైమాటే అని అంచనా వేస్తున్నారు.

## వేతన జీవులకు పండుగలాంటి వార్త.. వడ్డీ రేట్లను తగ్గించిన ఆర్బీఐ

లోన్లు తీసుకున్న వారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీపి కబురు చెప్పింది. ఈ మేరకు తాజాగా జరిగిన ద్రవ్య పరపతి సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇవాళ అధికారికంగా ప్రకటించారు. దేశంలోని ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకొని రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లుగా తెలిపారు. ఈ పరిణామంతో ప్రస్తుతం 5.50 శాతంగా ఉన్న రెపో రేటు 5.25 శాతానికి తగ్గనుంది. ప్రస్తుతం 3.35 శాతంగా ఉన్న రివర్స్ రెపో రేటులో ఎలాంటి మార్పు లేదు. అదేవిధంగా క్యాష్ రిజర్వ్ రేషియో యథాతథంగా ఉండగా, ద్రవ్యోల్బణం అంచనా 4.2 శాతం వద్దే కొనసాగనుంది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో హోమ్ లోన్, కారు లోన్, పర్సనల్ లోన్‌లపై వడ్డీ రేట్లు మరింత తగ్గే అవకాశం ఉంది. కాగా, ఇప్పటికే వరుసగా రెండోసారి రెపో రేటు తగ్గడం విశేషం.

ఈ సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. జీడీపీ వృద్ధి అంచనా 2025-26లో 6.5 శాతం నుంచి 6.7 శాతానికి పెంచినట్లు తెలిపారు. ఆర్థిక వృద్ధిని మరింత ఊపందుకోవడానికి, ప్రజలకు చౌకైన రుణాలు అందేలా ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. తాజా వడ్డీ రేట్ల తగ్గింపుతో దేశవ్యాప్తంగా బ్యాంకులు తమ లోన్ వడ్డీ రేట్లను త్వరలోనే సవరించనున్నాయి. సామాన్యుడికి ఇది గొప్ప ఊరట కలిగించే నిర్ణయంగా ఆర్థిక నిపుణులు అభివర్ణిస్తున్నారు.

## రూ.100 కోట్ల అవినీతి సామ్రాజ్యం..

### 3 రాష్ట్రాల్లో విస్తరణ.. ఏసీబీకి దొరికిన ల్యాండ్ రికార్డ్స్ ఏడి

మొదటి పేజీ తరువాయి

శ్రీనివాసులు తన సర్వీసులో అధిక భాగం.. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోనే విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రారంభంలో శ్రీనివాసులు.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సర్వేయర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత అక్కడే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూనే.. మేడ్చల్-మల్కాజిగిరికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.

అక్రమార్జనకు అలవాటు పడ్డ శ్రీనివాసులు.. సర్వే నంబర్లను మార్చడం, తప్పుడు సర్వే నివేదికలతో సర్కార్ ల్యాండ్స్‌ను ప్రైవేటు పరం చేసి భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉంటే గతంలో హైడ్రాకు తప్పుడు సమాచారం ఇవ్వడంతో శ్రీనివాసులు మీద క్రిమినల్ కేసు కూడా నమోదై ఉంది.

ఈ తనిఖీల్లో అధికారులు స్వాధీనం చేసుకున్న ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి

770 గ్రాముల వెండి వస్తువులతో పాటుగా 1.6 కేజీల బంగారు ఆభరణాలు, 5 లక్షల రూపాయల నగదు, కియా సెల్టోస్, ఇన్నోవా హైక్రాస్ కార్లు, నారాయణపేటలో 3, మహబూబ్‌నగర్ జిల్లాలో 4 చొప్పున ప్లాట్లు, నారాయణపేట జిల్లాలోని కృష్ణా మండలంలో రైస్ మిల్లుతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, ఏపీ, అనంతపురం జిల్లాలో 11, కర్ణాటకలో 11 ఎకరాల వ్యవసాయ భూములు

## ఆఫీసునే బార్‌గా మార్చిన ప్రభుత్వ ఉద్యోగి

కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు డ్యూటీ సమయంలో పనిచేయకుండా ఎంజాయ్ చేస్తుంటారు. మమ్మల్ని ఎవరు అడుగుతారు అనుకుంటారో లేదా మమ్మల్ని ఎవరు చూస్తారు అనుకుంటారో ఏమో కానీ దేనిని పట్టించుకోకుండా హ్యాపీగా చిల్ అవుతుంటారు. కొందరు అయితే ఆఫీసునే బార్ గా మార్చేస్తారు. అలాంటి ఓ ఘటనే ఏపీలోని కర్నూలులో జరిగింది.

ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఓ ఉద్యోగి డ్యూటీ సమయంలో మద్యం తాగాడు. సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగి ఏకంగా తన ఛాంబర్ లోనే కూర్చుని ఎంజాయ్ చేశాడు. ఆయన పక్కన ఓ పోలీస్ అధికారి సైతం ఉండటం ఆశ్చర్యకరం. ఓ వ్యక్తి అధికారి మద్యం తాగుతున్న సమయంలో మాటల్లో పెట్టి వారికి తెలియకుండా వీడియో తీశాడు. ప్రస్తుతం ఈ వీడియో వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది. దీంతో అధికారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## నరసరావుపేటలో దారుణం.. కడుపులో బ్లేడు వదిలేసిన వైనం

మొదటి పేజీ తరువాయి

ఆపరేషన్ తర్వాత కూడా మహిళకు కడుపునొప్పి తగ్గకపోగా, అది రోజురోజుకూ మరింత తీవ్రంగా మారిందని. నొప్పి భరించలేక మహిళ కుటుంబసభ్యులు ఆమెను వేరే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ జరిపిన సమగ్ర స్కానింగ్ పరీక్షల్లో అసలు విషయం బయటపడింది. ఆపరేషన్ చేసిన చోట ఒక బ్లేడు ముక్కను వైద్యులు కడుపులోపలే వదిలేసినట్లుగా వైద్య పరీక్షల్లో వెల్లడైందని. దాని వల్లే మహిళకు కడుపు నొప్పి తీవ్రమైనట్లు వైద్యులు గుర్తించారు. ఈ విషయం తెలియగానే రోగి కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యారు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్యులే ఇంత ఘోరమైన నిర్లక్ష్యానికి పాల్పడటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ దారుణ ఘటన నేపథ్యంలో మహిళ కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యంపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బాధ్యులైన డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, అలాగే బాధిత మహిళకు తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఘటనపై అధికారుల స్పందన కోసం కుటుంబసభ్యులు ఎదురుచూస్తున్నారు. వైద్యుల తీరుపై ప్రజలు, సంఘాలు పెద్ద ఎత్తున విమర్శలను గుప్పిస్తున్నారు.

## గ్రామంలో విషాదం.. గుండెపోటుతో సర్పంచ్ అభ్యర్థి మృతి!

జన్మనిచ్చిన గడ్డ మీద సర్పంచ్ గా పోటీ చేసి గెలిచి ఊరు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలానే ధృడ సంకల్పంతో ఎంతో ఉత్సాహంగా బరిలోకి దిగిన ఓ సర్పంచ్ అభ్యర్థి ఆకస్మికంగా మరణించడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఎంతో గొప్ప ఆశయంతో ప్రజాక్షేత్రంలో నిలిచిన సదరు అభ్యర్థి ఆశలన్నీ ఆవిరయ్యాయి. ఇక వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ అర్బన్ మండలం చింతల్ ఠాణా ఆర్ అండ్ ఆర్ కాలనీ ఎస్సీ జనరల్ కు రిజర్వ్ అవ్వగా బి.ఆర్.ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా చెర్ల మురళి(50) అనే వ్యక్తి నామినేషన్ వేసి ప్రచారంలో తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నాడు.

గుర్తుల కేటాయింపులో భాగంగా మురళికి సీరియల్ నెంబర్ 2 కత్తెర గుర్తు వచ్చింది. ఈ క్రమంలో గురువారం రాత్రి వరకు ఎంతో ఉత్సాహంగా, ప్రత్యర్థులను ఓడించి గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహించిన ఆయన అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో గుండెపోటుకు గురై మరణించాడు. దీంతో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మురళి సర్పంచ్ గా గెలిచి ఊరికి మెరుగైన సేవలు అందిస్తాడని భావిస్తే అకాల మరణం పొంది ఆశలు ఆవిరి చేశాడని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుచరులు, అభిమానులతో పాటు పలువురు గ్రామస్తులు తీవ్ర ఆవేదన చేస్తున్నారు.

ఎన్నిక నిలిచిపోయే ఛాన్స్...!

మరోవైపు సర్పంచ్ అభ్యర్థి మురళి అకాల మరణం పొందడంతో ఈనెల 11న జరగనున్న చింతల్ ఠాణా ఆర్ అండ్ ఆర్ కాలనీ సర్పంచ్ ఎన్నిక నిలిచిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గుర్తుల కేటాయింపు పూర్తి అయిన నేపథ్యంలో పంచాయతీరాజ్ చట్టం ప్రకారం అభ్యర్థి మరణిస్తే ఎన్నిక నిలిపివేయాలని నిబంధన ఉన్న నేపథ్యంలో దాదాపు ఎన్నిక నిలిచిపోయే అవకాశం ఉందని, దీనికి సంబంధించి ఇప్పటికే జిల్లా కలెక్టర్ కు స్థానిక అధికారులు నివేదిక సమర్పించగా, కలెక్టర్ నివేదిక ఆధారంగా రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు ఎన్నికను తాత్కాలికంగా నిలిపి వేయనున్నట్లు, వార్డులకు మాత్రం ఎన్నికలు యధావిధిగా జరగనున్నట్లు సమాచారం.

## అమెరికా ఆంక్షల వేళ భారత్ గడ్డపై రష్యా అధ్యక్షుడు కీలక ప్రకటన

గత అర్థ శతాబ్ధంగా భారత సైన్యానానికి ఆయుధాలు సమకూర్చడం వాటిని ఆధునీకరించడంలో రష్యా కీలక పాత్ర పోషిస్తోందని రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాలు ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుతాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. భారత్ కు రక్షణ సహకారాన్ని మరింత విస్తరిస్తామని చెప్పారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భారత్ తో కలిసి నడుస్తామని టెర్రరిజాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు భారత్?కు అండగా ఉంటామని స్పష్టం చేశారు. భారత పర్యటనలో ఉన్న రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. హైదరాబాద్ హౌస్ వేదికగా ఇరు దేశాధినేతలు 23వ ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. పలు అంశాలపై వీరు విస్తృతంగా చర్చించారు. ఆహార భద్రత, ఆరోగ్య రంగం, వాణిజ్యం, రక్షణ రంగం, కెమికల్స్, ఫెర్టిలైజర్స్, లేబర్ మైగ్రేషన్ మొబిలిటీ, పోర్టులు, నౌకాయానంతో పాటు పలు అంశాలపై ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు జరిగాయి. ఇందులో గంగా భారత్ ప్రధాని నరేంద్ర మోడీ-రష్యా అధ్యక్షుడు పుతిన్‌ల సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

ఇంధన సరఫరా కొనసాగిస్తాం:పుతిన్

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన పుతిన్.. తనకు అపూర్వ స్వాగతం పలికిన భారతీయులకు కృతజ్ఞతలు. భారత్ ఆతిథ్యం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అనేక అంశాల్లో ఇరు దేశాల మధ్య అవగాహన కుదిరిందని విభిన్న అంశాలపై ఇరు దేశాలు తమ అభిప్రాయాలను పంచుకున్నాయని పుతిన్ చెప్పారు. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గతేడాది భారత్-రష్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 12 శాతం పెరిగి రికార్డు సృష్టించిందని ఈ ఏడాది కూడా అదే స్థాయిలో పెరుగుదల ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య ట్రేడ్ మరింతగా పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సొంత కరెన్సీల్లోనే ఇరు దేశాల మధ్య వాణిజ్యం జరుగుతోందన్నారు. అమెరికా లాంటి దేశాల నుంచి వాణిజ్య ఒత్తిడులు ఎదురైతున్నప్పటికీ పెరుగుతున్న భారత ఆర్థిక వ్యవస్థ కోసం నిరంతరాయంగా ఇంధన రవాణాను కొనసాగించడానికి రష్యా సిద్ధంగా ఉందని చెప్పారు. కొడంకుళం అణువిద్యుత్ ప్రాజెక్టుకు రష్యా సహకరిస్తోందని చెప్పిన పుతిన్..ఇరు దేశాలు అతి పెద్ద భారతీయ అణు విద్యుత్ ప్లాంట్ ను నిర్మించే ప్రాజెక్టుపై పని చేస్తున్నాయని, ఆరు రియాక్టర్లలో ముడు ఇప్పటికే ఇంధన నెట్ వర్క్ కు అనుసంధానించబడ్డాయని చెప్పారు. విద్యుత్ రంగంలో ఖర్చు తగ్గించుకోవడానికి కావాల్సిన సాయం అందిస్తామన్నారు. హై క్వాలిటీ మెడిసినల్ డ్రగ్స్ విషయంలో భారత్ తో కలిసి పని చేస్తున్నామన్నారు. బ్రిక్స్, ఎస్?సీఓ లోనిసారూప్య ఆలోచనచలు కలిగిన దేశాలతో రష్యా, భారత్ సంతంత్ర, స్వయం సమృద్ధిగల విదేశాంగ విధానాన్ని నిర్వహిస్తున్నాయని రెండు దేశాలు ఐక్యరాజ్యసమితి ప్రధాన సూత్రాన్ని సమర్థిస్తున్నాయని చెప్పారు. రష్యా లేదా బెలారస్ నుంచి హిందూ మహాసముద్ర తీరం వరకు ఉత్తర-దక్షిణ రవాణా కారిడార్ ను రూపొందించే ప్రాజెక్టుతో సహా కొత్త అంతర్జాతీయ రవాణా మార్గాలను నిర్మించడానికి తమ దేశం భారత్ తో కలిసి పని చేస్తోందని అన్నారు.

# నాయుడు పంపులో ముందస్తు నోటీసు లేకుండా కూల్చివేతలు

**-జిడబ్ల్యుఎంసి టౌన్ ప్లానింగ్ అధికారి అవినాష్‌పై చర్యలు తీసుకోవాలి**

**-ఎంసిపిఐయు నగర కార్యదర్శి సాగర్ డిమాండ్**

వరంగల్,05 డిసెంబర్ (తెలుగు గళం): వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో ముందస్తు సమాచారం ఇవ్వకుండా అక్రమంగా కూల్చివేతలకు పాల్పడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారి అవినాష్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని








ఎంసిపిఐయు వరంగల్ నగర కార్యదర్శి మాలోతు సాగర్ డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.42వ డివిజన్ పరిధిలోని లెనిన్ నగర్‌లో నివసిస్తున్న పేదలపై టౌన్ ప్లానింగ్ అధికారి జులుం చూపుతున్నారని ఆయన మండిపడ్డారు.రోడ్డు మీదున్నాయనే నెపంతో ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా జేసీబీ సహాయంతో ఇళ్లముందు ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్లను ధ్వంసం చేశారని తెలిపారు.ఈ కూల్చివేతల కారణంగా రేకులు,ఐరన్ పైపులు,స్తంభాలు పూర్తిగా నష్టపోయాయని,దీంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఆర్థిక నష్టానికి గురయ్యాయని చెప్పారు.అనుమతులు లేకుండా చెరువులు,కుంటల్లో పెద్దలు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులకు కనబడటం లేదని, కానీ పేదలు బ్రతుకు దెరువు కోసం చిన్నచిన్న టీ కొట్టులు,టిఫిన్ సెంటర్లు పెట్టుకుంటే మాత్రం వారిపైనే అధికారులు ప్రతాపం చూపుతున్నారని సాగర్ తీవ్రంగా విమర్శించారు.ఈ అక్రమ కూల్చివేతలకు బాధ్యత వహించిన టౌన్ ప్లానింగ్ అధికారి అవినాష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌ను అధికారికంగా కోరుతున్నట్లు తెలిపారు.అలాగే నష్టపోయిన బాధిత కుటుంబాలకు వెంటనే తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

## ఒంటి మామిడిపల్లి గ్రామంలో జోరుగా కొనసాగుతున్న ఎన్నికల ప్రచారం



అయినవోలు ,05 డిసెంబర్ (తెలుగు గళం):హనుమకొండ జిల్లా అయినవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతోంది.ఈ క్రమంలో అధికార పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గిరుక రాజు శ్రీవల్లి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్ల ఆశీస్సులు కోరారు.ఓటర్లు ఆమెకు నీరాజనం పలుకుతూ తమ మద్దతు తెలియజేశారు.ఈ సందర్భంగా గిరుక రాజు శ్రీవల్లి మాట్లాడుతూ..తనను గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని,ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారాన్ని తన ప్రధాన లక్ష్యంగా చేసుకుంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో హనుమకొండ అదనపు కలెక్టర్


హనుమకొండ,05 డిసెంబర్ (తెలుగు గళం):హనుమకొండ జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏ సి బి) అధికారులు అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిని లంచం స్వీకరిస్తుండగా పట్టుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ గా కొనసాగుతూ ఇన్‌ఛార్జ్ డీఈవో (డి ఈ ఓ) బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన,హైస్కూల్




అనుమతి పత్రాల పునరుద్ధరణకు సంబంధించి రూ.60,000 లంచం తీసుకుంటూ ట్రాప్ అయినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.ఆయనతో పాటు జూనియర్ అసిస్టెంట్ మనోజ్‌ను కూడా ఏసీబీ నిర్బంధించింది.ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన అనుమతుల పునరుద్ధరణ ప్రక్రియలో లంచం డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదు నమోదు కావడంతో ఎసిబి జట్టు ప్రత్యేక పన్నాగం పన్ని ఈ చర్య చేపట్టింది.ప్రభుత్వ ఉన్నతాధికారిపై ఏసీబీ చేసిన ఈ చర్య జిల్లాలో భారీ సంచలనానికి దారితీసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## అశ్రమ,జీపీఎస్ పాఠశాలల్లో మెరుగైన బోధన-వసతులపై కట్టుదిట్టమైన ఆదేశాలు

**ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఐటిడిఏ పీఓ బి. రాహుల్**



భద్రాద్రి కొత్తగూడెం,05 డిసెంబర్ (తెలుగు గళం):గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు,జీపీఎస్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు చదువుతోపాటు వసతి,భోజన సౌకర్యాలు మెరుగ్గా కల్పించే బాధ్యతను సంబంధిత హెచ్‌ఎంలు,వార్డెన్లు ప్రత్యేకంగా తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ స్పష్టం చేశారు.ఉద్దీపకం వర్క్‌బుక్‌లోని అంశాలు ప్రతి పిల్లవాడికి పూర్తిగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ఆదేశించారు.శుక్రవారం దుమ్ముగూడెం మండలంలోని నారాయణరావుపేట గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల,మంగువాయి బడవ బాలికల ఆశ్రమ పాఠశాలలు,గంగారం,ఆదర్శనగర్ జీపీఎస్ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా నారాయణరావుపేట, మంగువాయి బడవ ఆశ్రమ పాఠశాలల్లో కొనసాగుతున్న ఇంజనీరింగ్ పనులను పరిశీలించి,పనులు నాణ్యతతో జరగాలని సంబంధిత ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశారు.హెచ్‌ఎంలు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ పనులు సక్రమంగా పూర్తిచేయించాలన్నారు.

నారాయణరావుపేట ఏహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పై అధికారుల అనుమతి లేకుండా సెలవులోకి వెళ్లినందుకు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని పేర్కొంటూ,ఆయన్ను హెచ్‌ఎం విధుల నుండి తప్పించి సోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ అశోక్‌కు పీఓ రాహుల్ ఆదేశించారు.మంగువాయి బడవ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన ఆయన,ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందుతున్నదీ లేనిదీ విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు.రోజూ సమయానికి,మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని,వంట పూర్తయిన





తరువాత ముందుగా హెచ్‌ఎం,వార్డెన్,సిబ్బంది రుచి చూసిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలని సూచించారు.ప్రతి నెల రెండో శుక్రవారం,నాలుగో శుక్రవారం తప్పనిసరిగా కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.గంగారం జీపీఎస్ పాఠశాలలో ఉద్దీపకం వర్క్‌బుక్ అంశాలను పిల్లల చేత బోర్డుపై రాయించి,ప్రతి అంశాన్ని వారితో వివరింపజేసి సంతృప్తి వ్యక్తం చేశారు.అయితే ఆదర్శనగర్ జీపీఎస్ పాఠశాలలో ఉద్దీపకం వర్క్‌బుక్ నిర్వహణ సరిగా లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.వారం రోజులలోగా పిల్లలందరికీ ఉద్దీపకం వర్క్‌బుక్ అంశాలు పూర్తిగా అర్థమయ్యేలా బోధించాలని,సంబంధిత ఎస్సిఆర్పి వారానికి రెండు రోజులు పూర్తి సమయం పాఠశాలలో ఉండి పర్యవేక్షించాలని ఆదేశించారు.పిల్లలు అంశాలను సక్రమంగా చెప్పలేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నారాయణరావుపేట ఇన్చార్జి హెచ్‌ఎం బాలాజీ,మంగువాయి బడవ హెచ్‌ఎం వీరమ్మ, జీపీఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు లక్ష్మి,నిర్మలతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో ముందస్తు అరెస్టులు

**విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టుపై బీఆర్ఎస్వీ ఆగ్రహం**




నర్సంపేట ,05 డిసెంబర్ (తెలుగు గళం):ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్సంపేట నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం(బీఆర్ఎస్వీ)నాయకులను అర్ధరాత్రి నుండి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీఆర్ఎస్వీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు.ఈ సందర్భంగా నర్సంపేట నియోజకవర్గ బీఆర్ఎస్వీ కన్వీనర్ సధిరం వినయ్ భాస్కర్,పట్టణ అధ్యక్షుడు దేవోజు హేమంత్,నాయకులు నల్ల రవీందర్ మాట్లాడుతూ..ప్రభుత్వ హామీల అమలు గురించి ప్రశ్నిస్తే భయపడి విద్యార్థి నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ఏ రకమైన ప్రజా పాలన అని ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఎందుకు ఇంత భయం అని నిలదీశారు.ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రానున్న రోజుల్లో విద్యార్థులు,నిరుద్యోగులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఇప్పటికీ నర్సంపేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ కేసీఆర్ హయాంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీసుకొచ్చిన నిధులతోనే కొనసాగుతున్నాయని వారు ఆరోపించారు.కొత్తగా ప్రస్తుత ప్రభుత్వం నియోజకవర్గానికి కేటాయించిన నిధులు ఏవీ లేవని విమర్శించారు.మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నర్సంపేట నియోజకవర్గంలో పేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థాయికి చేరాలనే లక్ష్యంతో మెడికల్ కాలేజ్,నర్సింగ్ కాలేజ్,సైనిక్ స్కూల్,అన్ని మండల కేంద్రాల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ గురుకుల పాఠశాలలు,కళాశాలలు,అలాగే నర్సంపేట పట్టణంలో అన్ని వర్గాల విద్యార్థులకు సంక్షేమ హాస్టళ్లను తీసుకొచ్చారని గుర్తు చేశారు.ఈ చర్యలతోనే నర్సంపేట నియోజకవర్గాన్ని ఒక ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దిన ఘనత పెద్ది సుదర్శన్ రెడ్డికే దక్కుతుందని వారు స్పష్టం చేశారు.

## కట్ర్యాల గ్రామంలో ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్ పార్టీ

**ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య విస్తృత ప్రచారం**




వర్ధన్నపేట,05 డిసెంబర్ (తెలుగు గళం):వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కట్రీయాల గ్రామములో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య కట్రీ యాల గ్రామములో సర్పంచ్ అభ్యర్థి సుల్తాన్ దుర్గమ్మ గెలుపు కోసం మొదటి వార్డు సభ్యులు అభ్యర్థి నాంపెల్లి రవీందర్ వార్డులో ఇంటి, ఇంట, గడప, గడపకు తిరుగుతూ సర్పంచ్ ఉంగరం గుర్తుకు,వార్డు మెంబర్ గ్యాస్ గుర్తుకు ఓటు వేయవలసిందిగా ప్రజలను కోరడం జరిగింది.ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ నేడు ఒకటవ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేస్తున్నాం మీ మీడియా సాధనాల ద్వారా గ్రామ ప్రజలకు అభ్యర్థిస్తున్నాం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుచున్నాం కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కారు,మన ఎమ్మెల్యే అభివృద్ధి, సంక్షేమం లో భాగంగా మన గ్రామానికి 24 ఇందిరమ్మ ఇండ్లు వచ్చినాయి కట్టుకుంటున్నారు,35 రేషన్ కార్డులు వచ్చినాయి సన్న బియ్యం తీసుకొంటున్నారు ఉచిత బస్సు ప్రయాణం తో మన గ్రామము నుండి వేములవాడ కు కూడా పోయి మొక్కులు కూడా చెల్లిస్తున్నారట ప్రజలు చెపుతున్నారు. అదేవిధంగా మానగ్రామములో గత 15 సంవత్సరాలు సర్పంచిలుగా ఏలినవారు,గ్రామానికి ఒక్క గుండు సూది కూడా రాలేదు కనీసం ఏ ఒక్క కులానికి ఒక్క కమిటి హాలు కూడా ఇవ్వలేదు, ప్రకృతి వనాల పేరుమీద అక్రమాలు ప్రకృతి వనాలను ఉపయోగం లేని చోట నిర్మాణం చేసి ప్రభుత్వం సొమ్ము దుర్వినియోగం చేశారు పశు వైద్య శాల పట్టించుకోలేదు,కానీ మన ఎమ్మెల్యే నాగరాజు గారు గ్రామ ప్రజల కోరిక మేరకు 100 పడకల ఆసుపత్రి శాంక్షన్ అయి పనులు కూడా చేపట్టడం జరుగుతుంది.కనుక గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుచున్నాం.ఈ కార్యక్రమములో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి చోటే బై, మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండి అక్బర్,కామిండ్ల రాజు కుమార్ చిక్కొండ రాజు లు పాల్గొన్నారు.

# బి ఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- బాల్య తండా గ్రామ బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి జర్పల కాలు నాయక్
- వెంకట్య తండా బిఆర్స్ సర్పంచ్ అభ్యర్థి గుగులోత్ మాలి సూర్య నాయక్,
- వీరారం బి ఆర్ స్ పార్టీ అభ్యర్థి గుండె రాములు

మహబూబాబాద్ ,05 డిసెంబర్ (తెలుగు గళం):బాల్య తండా లో తిరిగి గులాబీ జెండాను ఎగురేస్తామని బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి జరుపుల కాలు నాయక్ అన్నారు. వెంకట్య తండా బి ఆర్ స్ అభ్యర్థి గుగులోత్ మాలి సూర్య నాయక్, వీరారం బి ఆర్ స్ పార్టీ అభ్యర్థి గుండె రాములు నామినేషన్ దాకలు చేసారు,ఈ సందర్బంగా కాలు నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ రుణపడి ఉంటానన్నారు. ఆయన నమ్మకాన్ని వమ్ముచేయకుండా తన శాయశక్తుల గ్రామాభివృద్ధికి తోడ్పడతానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని గుర్తు చేశారు,అనంతరం వెంకట్య తండా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గుగులోత్ మాలి సూర్య నాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి శరవేగంగా జరిగిందన్నారు.రైతాంగాన్ని మన బి ఆర్ స్ పాలకులే ఆదుకున్నారన్నారు. వీరారం బి ఆర్ స్ పార్టీ అభ్యర్థి గుండె రాములు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేరిట రైతుల ని ఆగం చేసారు అన్నారు, యూరియా కోసం రైతులు పడని తిప్పలు లేవని వారు అన్నారు,

ఈ సందర్బంగా అభ్యర్థులు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉండి అభివృద్ధి కోసం అర్నిశలు కృషి చేస్తామని తమను భారీ మెజారిటీతో సర్పంచ్ గా గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు నామినేషన్ వేసేందుకు తరలివచ్చిన ప్రతీ ఒక్కరికి పేరుపేరున సర్పంచ్ అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారంతా అండగా నిలిచి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బాల్య తండా నేతలు పాపా నాయక్, వీరన్న, లచ్చు, బాలు, హరి నాయక్, వెంకట్య తండా బి ఆర్ స్ నాయకులు వినయ్, లింగ నాయక్, దుప్ సింగ్ నాయక్, రమేష్, కన్నా, రత్న, మంగు, పాల్గొన్నారు.



వీరారం గ్రామ బి ఆర్ స్ నాయకులు మామిడాల మునిష్, బొల్లం నర్సయ్య, దుస్సా నర్సీయ్య, చింతల లింగయ్య, ఎర్పుల మల్లయ్య తదితరులు





# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాలి
- ప్రజా ప్రభుత్వం తో నే, అభివృద్ధి సాధ్యం.
- పేద ప్రజల సంక్షేమం కాంగ్రెస్ పార్టీ లక్ష్యం.



మహబూబాబాద్ ,05 డిసెంబర్ (తెలుగు గళం): స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి గా కాంగ్రెస్ పార్టీ బలపరచిన భూక్యా జానకి రాములు నాయక్ నామినేషన్ దాకలు చేసారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మపై నమ్మకం తో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా అవకాశం ఇచ్చిన ఏమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్, మండల పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘువీర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ మన తండా లో మన రాజ్యం రావాలి అప్పుడే మన తండా అభివృద్ధి చెందుద్ది అన్నారు,నాడు నేడు ఏనాడైనా అభివృద్ధి చేసింది కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ ఏ అన్నారు,కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం సాధ్యం,ప్రజా ప్రభుత్వం ఇచ్చినన్నీ సంక్షేమ పథకాలు ఇవ్వడానికి ఏ ప్రభుత్వానికి కూడా ధైర్యం సరిపోలేదు అన్నారు,పదేండ్లలో బీఆర్ఎస్ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోయింది అన్నారు,ఆ పార్టీ నాయకులు తమ సొంత అభివృద్ధి కోసం మాత్రమే పని చేశారు అన్నారు, మాకు అవకాశం కల్పిస్తే తండా ను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకుపోతామన్నారు, తండ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడతానని అందరూ ఆశీర్వదించి తనను భారీ మెజార్టీతో సర్పంచ్ గా గెలిపించాలని పార్టీ అభ్యర్థి జానకి రాముల నాయక్ విజ్ఞప్తి చేశారు,ఈ కార్యక్రమం లో మూలమర్రి తండా నాయకులు నెహ్రూ, భరత్, వెంకన్న, వీరన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న బోయినపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ప్రచారం



ములుగు,05 డిసెంబర్ (తెలుగు గళం):ఏటూరు నాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతోంది. గ్రామంలోని ప్రధాన వీధుల్లో కార్యకర్తలు,స్థానిక నాయకులతో కలిసి పార్టీ జెండాలు ఊపుతూ ప్రచారం చేపట్టారు.పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ ప్రజలకు వివరించడంతో పాటు రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీకి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.స్థానిక కార్యకర్తలు ఐక్యంగా భాగస్వామ్యం చేయడం ప్రచారానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.గ్రామ ప్రజల స్పందన సంతృప్తికరంగా ఉందని కార్యకర్తలు తెలిపారు.

# ఎస్ జి ఎఫ్ క్రీడల్లో ఏకశిల విద్యార్థుల అత్యుత్తమ ప్రదర్శన

- ఒకే పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ఆల్ రౌండ్ షో
- అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం
- విద్యార్థి క్రీడాకారులను అభినందించిన చైర్మన్ తిరుపతిరెడ్డి




అయినవోలు ,05 డిసెంబర్ (తెలుగు గళం): హనుమకొండ జిల్లా ఐనవోలు: స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ (ఎస్ జీ ఎఫ్) రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఏకశిల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఎస్ జీ ఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–14, అండర్–17 ఫుట్ బాల్, హాకీ, బేస్ బాల్, నెట్ బాల్ క్రీడా పోటీల్లో బాల బాలికలు పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. దీంతో పాటుగా హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, ఖో ఖో, కబడ్డీ, క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి శుక్రవారం ఐనవోలు మండలంలోని ఈ టెక్నో పాఠశాలలో విద్యార్థులకు షీల్డులు బహుకరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏకశిల విద్యార్థులు క్రీడల్లో రాణించడం హర్షణీయమన్నారు. క్రీడలతో పాటు విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడం మా లక్ష్యమన్నారు. దానికి అనుగుణంగానే పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులను కల్పించి తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ యండి. బాబా మాట్లాడుతూ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచేందుకు విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుల ఇంచార్జి నర్సయ్య, పిఈటీ లు రజినీకర్, రాజేష్, రవీందర్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికై పాటుపడతా ఆశీర్వదించండి

- రాంపురం సర్పంచ్ అభ్యర్థి కొమ్ము చెంద్రశేఖర్



మహబూబాబాద్,05 డిసెంబర్ (తెలుగు గళం):గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడతానని తనను అందరూ ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని మరిపెడ మండలంలోని రాంపురం సర్పంచ్ అభ్యర్థి కొమ్ము చెంద్రశేఖర్ కోరారు.రాంపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో పలు సమస్యలు నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని తొలగించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.దళిత,వెనుకబడిన తరగతుల చెందిన ఎన్నో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని,వారి పేదరిక నిర్మూలన కోసం సంక్షేమ పథకాలు మంజూరు చేయించి ఆదుకోవడం జరుగుతుందన్నారు.ఎంతోమంది చదువుకుని గ్రామంలో నిరుద్యోగులుగా మిగిలిపోయారని వారికి ఉపాధి పథకాలు మంజూరు చేయిస్తానన్నారు.చాలా మందికి పక్క గృహాలు లేకపోవడంతో ఇరుకు గదుల్లో జీవనం సాగిస్తున్నారని అర్హులైన వారందరికీ పక్కా గృహాలు మంజూరు చేయించడానికి కృషి చేస్తానన్నారు.అర్హులైన వారందరికీ సామాజిక పెన్షన్లు,రేషన్ కార్డులు మంజూరు చేయిస్తానన్నారు.రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాక ప్రతి ఏటా నష్టపోతున్నారని కమర్షియల్ పంటలు సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించి వారి అభ్యున్నతి కోసం పాటుపడతానన్నారు.గ్రామంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చోట బోర్లు వేయించి నీటి సమస్య లేకుండా చేస్తా అన్నారు,

గ్రామంలో అవసరమైనచోట మురికి కాలువలు,సీసీ రోడ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీకి సొంతభవనం, గ్రామం లోని ఎస్సీ,బీసీ కమ్యూనిటీ భవనాల మంజూరు కోసం కృషి చేస్తానన్నారు, గ్రామ ప్రజలఅందరికీ అందుబాటులో ఉండి కుల మతాలకు అతీతంగా గ్రామ సర్వతోముఖాభివృద్ధికి కోసం అహర్నిశలు పాటు పడతానని అందరూ ఆశీర్వదించి తనను భారీ మెజారిటీతో సర్పంచుగా గెలిపించాలని అభ్యర్థి కొమ్ము చెంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో రాంపెల్లి రవి గౌడ్, కొమ్ము నరేష్, దోమల సత్తయ్య, రాంపెల్లి నాగన్న, రాంపెల్లి చిన్న వెంకన్న, బందు పర్శరాములు, ఈరగని వెంకన్న, నర్సీయ్య, గంగారాబోయిన రమేష్, కుంచం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి సర్పంచి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి

**బిజెపి రాష్ట్ర నాయకులు గాదె రాంబాబు**



మహబూబాబాద్,05 డిసెంబర్ (తెలుగు గళం):మహబూబాబాద్ జిల్లా జిల్లా మరిపెడ మండలం నీలుకుర్తి గ్రామంలో బిజెపి పార్టీ సర్పంచి అభ్యర్థిగా హరికిషన్ మహిళా కోలాటాలతో ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్ర నాయకులు గాదె రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని బిజెపి సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో గాదే రాంబాబు మాట్లాడుతూ బిజెపి పార్టీ సర్పంచ్ అభ్యర్థి హరికిషన్ నుభారీ మెజార్టీతో గెలిపించాలని, ఆయన కోరారు.అనంతరం బిజెపి సర్పంచ్ అభ్యర్థి హరికిషన్ మాట్లాడుతూ సర్పంచ్ గా గెలిపించిన తర్వాత గ్రామం కోసం సైడ్ డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు, గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి హరికిషన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు భాస్కర్, గంగాధర జనార్ధన్, మరిపెడ మండల బిజెపి అధ్యక్షుడు గంగాధర్, లింగన్న, తప్పట్ల రాములు, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# లక్నేపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి గా పాత్కాల లక్ష్మి కొమ్మలు నామినేషన్ వేయటం జరిగినది



లక్నేపల్లి( నర్సంపేట ),05 డిసెంబర్ (తెలుగు గళం):నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామానికి చెందిన పాత్కల లక్ష్మి కొమ్మలు బి ఆర్ స్ పార్టీ అభ్యర్థి గా సర్పంచ్ ఎన్నికల బరిలో నామినేషన్ సమర్పించి ఎన్నికకు గాను గ్రామ ప్రజల మద్దతు ఇవ్వవలసిందిగా కోరుతూ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలియజేస్తూ ఈసందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి బి ఆర్ స్ పార్టీ అభ్యర్థి పాత్కాల లక్ష్మి కొమ్మలు మాట్లాడుతూ మన గ్రామ ప్రజల ఆశీస్సులతో గ్రామ సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు తెలియజేస్తూ గ్రామ అభివృద్ధిలో తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ గ్రామం లో ని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూ అందరికీ అందుబాటులో ఉంటు కొన్ని సంవత్సరాలుగా మన గ్రామ అభివృద్ధి లో పాలు పంచుకుంటూ గ్రామ ప్రజల అందరితో మమేకమై ఉంటూ ప్రజల కష్ట సుఖాలలో ఉంటూ వారికి ఏ ఆపద వచ్చినా నా వంతు సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నానని అలాగే లక్నేపెల్లి గ్రామ సర్పంచిగా నాకు అవకాశం ఇవ్వాల్సిందిగా గ్రామ ప్రజలందారిని కోరుతూ వారి ఆశీస్సులతో ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలనిఈ రోజు నామినేషన్ పత్రాలు సమర్పించడం జరిగింది. కావున ప్రజలు ఒకసారి అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా తెలియజేస్తూ గ్రామ ప్రజలందరూ అభివృద్ధికి ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరికీ తెలియజేశారు ఇట్టి నామినేషన్



కార్యక్రమంలో గ్రామ ప్రజలు యువతి యువకులు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు ప్రకటించారు.

# గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య



వర్ధన్నపేట,05 డిసెంబర్ (తెలుగు గళం): వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన రాకేష్ (28) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ జరుగుతుందని అన్నారు.

# మహిళల రక్షణ,సౌకర్యాలపై

## లోక్ సభలో ప్రైవేటు బిల్లులను ప్రవేశ పెట్టిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



వరంగల్/న్యూఢిల్లీ ,05 డిసెంబర్ (తెలుగు గళం):మహిళల రక్షణ,సౌకర్యాలు,సామాజిక భద్రతను బలోపేతం చేసే దిశగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో రెండు కీలక ప్రైవేట్ బిల్లులను ప్రవేశపెట్టారు.మూడు దశాబ్దాల తర్వాత తెలంగాణ నుంచి ఒక మహిళా ఎంపీ ఇలాంటి ప్రత్యేక బిల్లులను ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి కావడం విశేషం.ఉద్యోగ రంగంలో నెలసరి సమయంలో మహిళలకు అవసరమైన సౌకర్యాలు–అందుబాటు గదులు,శుభ్రమైన రెస్ట్‌రూములు,తగిన ఆరోగ్య వసతులు..కల్పించేందుకు చట్టపరమైన నిబంధనలు తప్పనిసరి చేయాలని మొదటి బిల్లులో డా.కావ్య ప్రతిపాదించారు.మహిళల ఆరోగ్యం,ఉద్యోగ ఉత్పాదకత, భద్రత దృష్ట్యా ఈ చర్య అత్యంత కీలకమని ఆమె స్పష్టం చేశారు.ఇక రెండో ప్రైవేట్ బిల్లులో ఒంటరి మహిళలు,వితంతువులు,ఆపన్నస్థితిలో ఉన్న స్త్రీలకు ప్రభుత్వంచే అత్యవసర సహాయం,ఆధార వేతనాలు,గృహ భద్రత,సామాజిక సంక్షేమ చర్యలు తక్షణం అందేలా ప్రత్యేక విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు.ఈ రెండు బిల్లులను లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించగా,మహిళా సాధికారత దిశగా ఇది మరొక ముఖ్యమైన అడుగుగా నిలిచింది. వరంగల్ ఎంపీ ప్రవేశపెట్టిన ఈ బిల్లులు దేశవ్యాప్తంగా మహిళా సంక్షేమానికి మార్గదర్శకంగా ఉండనున్నాయని మహిళ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# గిరిజన గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వ దవాఖానాలోనే కాన్పులు జరగాలి

## నిర్లక్ష్య వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవు-జిల్లా వైద్యాధికారి డా.తుకారం రాథోడ్



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి,05 డిసెంబర్ (తెలుగు గళం):మారుమూల మండలాల ఆదివాసి గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు,ముఖ్యంగా గిరిజన గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారం రాథోడ్ వైద్య సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా ప్రభుత్వ దవాఖానాల్లోనే కాన్పులు అయ్యేలా చూడాలని,వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని సూచించారు.విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యాధికారులు,సిబ్బందిపై శాఖాపరమైన చర్యలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.శుక్రవారం నాడు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదేశాల మేరకు భద్రాచలం పట్టణంలోని గిరిజన అభ్యుదయ భవనంలో భద్రాచలం డివిజన్ స్థాయి వైద్య ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డా.తుకారం రాథోడ్ మాట్లాడుతూ..చలి తీవ్రత పెరుగుతున్నందున గిరిజన గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా,టైఫాయిడ్,వైరల్ ఫీవర్ వంటి వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని,అందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించాలని సూచించారు.వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చికిత్సలు ప్రారంభించాలని తెలిపారు.గర్భిణీ స్త్రీల నమోదు శాతం 100 శాతం పెంచాలని,డెలివరీ కోసం వచ్చే మహిళలకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని సాధ్యమైనంత వరకు నార్మల్ డెలివరీలు జరిగేలా చూడాలని సూచించారు. ప్రతి గ్రామంలో మాత–శిశు సంరక్షణ కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాలని,మలేరియా,టీబీ వంటి వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ నెల 18వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రతి గిరిజన గ్రామంలో ఇంటింటికి తిరిగి ఐసీడీసీ సర్వేను ముమ్మరంగా నిర్వహించాలని ఆదేశించారు.ప్రతి నెల 14వ తేదీ నాడు సబ్ సెంటర్లలో తప్పనిసరిగా హెల్త్ మేళా నిర్వహించాలని,అలాగే ప్రతి నెల మూడవ శనివారం జనని ఆరోగ్య సమితి కమిటీ సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.సబ్ సెంటర్,సిహెచ్‌సి,పీహెచ్‌సీలకు వచ్చే రోగులతో వైద్య సిబ్బంది మర్యాదగా వ్యవహరించి సరైన వైద్య చికిత్సలు అందించడంతో పాటు తగినన్ని మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.గిరిజన గ్రామాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని,నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వ



ఉండటం వల్ల దోమల తీవ్రత పెరిగి మలేరియా,డెంగ్యూ,టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు.ఈ ప్రోగ్రాంలో ఏడీఎంహెచ్‌ఓలు డాక్టర్ సైదులు,డాక్టర్ విజయలక్ష్మి,డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ స్పందన, ఎన్వీబీడీసీపీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ తేజశ్రీ,ఇమ్మ్యునైజేషన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పుల్లారెడ్డి, ఎన్‌టీఈపీ, పీహెచ్‌సీ సూపర్వైజర్లు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తొర్రుర్ సిపిఎం నాయకులను జైల్లో నిర్బంధించడాన్ని ఖండిస్తున్నాం

## సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న



తొర్రుర్, 05 డిసెంబర్ (తెలుగు గళం): ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ ఇండ్లు మంజూరి చేయాలని శాంతియుతంగా పోరాడుతున్న పేద ప్రజలకు అండగా నిలిచిన సిపిఐఎం నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైల్లో నిర్బంధించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న అన్నారు. శు క్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఆరు నెలలుగా ఇండ్లు లేని నిరుపేదలకు నిర్మించి ఉన్న ఇండ్లను మంజూరి చేయాలని పోరాటం చేస్తున్న వారికి ఎర్రజెండా అండగా నిలిచిందన్నారు. ఈ సందర్భంలో సమస్యను పరిష్కరించే దిశగా స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చొరవ చూపాలన్నారు. తక్షణమే అరెస్టు చేసిన నాయకులను బేసరత్తుగా విడుదల చేయాలన్నారు. చిన్నచిన్న కారణాలను సాకుగా చూపిస్తూ నాయకులను అరెస్టు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# మహిళా-శిశు అభ్యున్నతికి కేంద్ర పథకాల అమలు అత్యంత కీలకం -ఎంపీ డా.కడియం కావ్య

వరంగల్/న్యూఢిల్లీ ,05 డిసెంబర్ (తెలుగు గళం):మహిళల సాధికారత,బాలల సంక్షేమం,పోషణ,మహిళల రక్షణ సేవల అమలు రాష్ట్ర పురోగతికి కీలకమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.ఈ అంశాలపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ సమాధానం ఇచ్చారు.బేటీ బచావో బేటీ పడావో మహిళా శక్తి కేంద్రం,అంగన్‌వాడీ%–%పోషణ 2.0,వన్ స్టాప్ సెంటర్లు,181 హెల్ప్‌లైన్ వంటి కార్యక్రమాల అమలును శాఖ నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు.బిబిబిపి పథకం వల్ల బాలికల విద్య, రక్షణ,నైపుణ్యాభివృద్ధిలో గణనీయ పురోగతి కనిపిస్తోందని చెప్పారు.తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఈ పథకం అమలులో ఉందని పేర్కొన్నారు.2022లో నిలిపివేసిన మహిళా శక్తి పథకానికి బదులుగా 'మిషన్ శక్తి' అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఇందులో మహిళల భద్రత,రక్షణ,సాధికారతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు.వరంగల్ జిల్లా మహిళా అభివృద్ధి కేంద్రం అవగాహన కార్యక్రమాలు,పథకాల ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు.అంగన్‌వాడీ–పోషణ 2.0 ద్వారా పిల్లల పోషణ,ప్రీ–స్కూల్ విద్య,మౌలిక సదుపాయాల పురోభివృద్ధి జరుగుతుందని తెలిపారు.తెలంగాణలో 35,769 అంగన్‌వాడీ సెంటర్లు శిశువుల ఎదుగుదల పర్యవేక్షణ పరికరాలతో సిద్ధంగా ఉండడం వల్ల పోషకాహార లోపాలను సకాలంలో గుర్తించి చర్యలు తీసుకోవడం సాధ్యమవుతోందని చెప్పారు.మీల్స్,టేక్ హోమ్ రేషన్ ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, వయోజన బాలికలకు జీవచక్ర విధానంలో పోషకాహారం అందుతున్నట్లు వివరించారు.మహిళలపై హింస నివారణలో వన్ స్టాప్ సెంటర్ల పాత్ర ముఖ్యమని మంత్రి తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 36 ఓఎస్సిలు 2015 నుంచి 77,858 మహిళలకు వైద్య,చట్టపర,మానసిక సహాయం వంటి సేవలు అందించాయని చెప్పారు.181 మహిళా హెల్ప్‌లైన్ ఈఆర్ఎస్ఎస్ – 112తో అనుసంధానమై 76,444 కేసుల్లో స్పందించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ..ఈ పథకాలు వరంగల్ సహా గ్రామీణ ప్రాంతాల్లో



మరింత వేగంగా అమలు కావాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపం తగ్గడం,లింగ వివక్ష తగ్గించే దిశగా ఇవి మరింత ప్రభావవంతంగా పనిచేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

# నియోజకవర్గంలో 12గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం

- ఏకగ్రీవం గ్రామ పంచాయతీలకు తక్షణమే 25లక్షల ప్రభుత్వ నిధులు మంజూరు
- జనగామ జిల్లాలో అత్యధిక ఏకగ్రీవాలు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోనే అయ్యాయి
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి,కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకంతోనే ఏకగ్రీవాలు
- గ్రామ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సర్పంచ్ ను ఎన్నుకోవాలి
- నిజాయితీ గల అభివృద్ధి,అవినీతి లేని పథకాల అమలు కోరుకునే వారు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి




స్టేషన్ ఘనపూర్ ,05 డిసెంబర్ (తెలుగు గళం):జనగామ జిల్లా పరిధిలో అత్యధిక ఏకగ్రీవాలు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోనే కావడం చాలా సంతోషమని మాజీ ఉప ముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ లతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ లను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ....స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో మొదటి విడతలో ఎన్నికలు జరుగుతున్న 110గ్రామ పంచాయతీలకు 10గ్రామ పంచాయతీలు అలాగే రెండవ విడతలో ఎన్నికలు జరగనున్న ధర్మసాగర్,వేలేరు మండలాలలో 2,గ్రామ పంచాయితీలు మొత్తం 12గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయని తెలిపారు.ధర్మసాగర్,వేలేరు మండలాలలో విత్ డ్రా కు రేపటి వరకు సమయం ఉన్నందున మరిన్ని ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉందని అన్నారు.ఏకగ్రీవం అయిన గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులకు తక్షణమే 25లక్షలప్రభుత్వ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు సర్పంచ్ ను ఎన్నుకోవాలని సూచించారు.ఇంకా 3ఏళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని ఏ రకమైన అభివృద్ధి జరగాలన్న కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందని తెలిపారు.ఇతర పార్టీల అభ్యర్థులు గెలుస్తే ప్రభుత్వం దగ్గరికి,ఎమ్మెల్యే దగ్గరకు రాలేరని దింతో గ్రామ అభివృద్ధి కుంటు పడుతుందని వెల్లడించారు.కావున కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులనే గెలిపించాలని కోరారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరితోనే అభివృద్ధి జరుగుతుంది అని అనుకుంటే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని,ఎక్కడా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు.గడిచిన 2ఏళ్లలో ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.ప్రతీ గ్రామంలో సిసి రోడ్లు,ఇందిరమ్మ ఇల్లు,రేషన్ కార్డులు,సన్న బియ్యం పంపిణి వంటి అభివృద్ధి,సంక్షేమ పనులు జరుగుతున్నాయని తెలిపారు.దేవాదుల ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి రెండో పంటకు కూడా సాగు నీరు అందించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు.నిజాయితీతో కూడిన అభివృద్ధి,అవినీతి లేకుండా సంక్షేమ పథకాల అమలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు,మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి,చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు,నియోజకవర్గ నాయకులు,ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ లు, వార్డు మెంబర్లు,ఇతర నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# విద్యార్థులను విడుదల చేయండి

: పటోళ్ల నాగి రెడ్డి




బాగ్‌లింగంపల్లి,05డిసెంబర్(తెలుగుగళం): అక్రమంగా నిర్బంధించిన విద్యార్థులను బేషరత్తుగా విడుదల చేయాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల నాగి రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, విద్యార్థుల అక్రమ నిర్బందనను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. గత నెల 18న ఆంధ్రప్రదేశ్ మారేడుమిల్లిలో సిపిఐ(మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు మాడవి హిడ్మా సహచరుల ఎన్కౌంటర్‌పై అధ్యయనం చేయడానికి వెళ్లిన విశ్వవిద్యాలయ విద్యార్థులపై ఏపీ ప్రభుత్వం దమనకాండను తీవ్రంగా విమర్శించారు. విద్యార్థులు తమ కార్యక్రమం ప్రకటించి అధికారులకు తెలియజేసినా దుర్మార్గంగా వ్యవహరించడం, 'మావోయిస్టులు' అని కిరాయి మనుషులు నినాదాలు చేయడం, పోలీస్ స్టేషన్‌కు తరలించడం సిగ్గుచేటు అని అన్నారు. బూటకపు ఎన్కౌంటర్ విషయం తేటతెల్లడానే భయంతో చింతూరు పోలీస్ స్టేషన్‌లో వారిని నిర్బందించారని ఆరోపించారు.కేంద్రంలో భాగస్వాములైన టీడీపీ-జనసేన పార్టీలు మోడీ, అమిత్ షా సర్కారుకు వంతపడుతూ రాజ్యాంగ విలువలు, హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థులకు ఎలాంటి హాని జరిగినా ఏపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని సంఘం ప్రధాన కార్యదర్శి వెల్లూరు సదానందం డిమాండ్ చేశారు

# ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేయకపోతే కలిగే దుష్పరిణామాలు ఇవే..

# కచ్చితంగా ఏదో ఒకటి తినాల్సిందే..

హెల్త్ న్యూస్, 05 డిసెంబర్ (తెలుగు గళం): రోజూ అందరూ వివిధ రకాల బ్రేక్‌ఫాస్ట్‌లు చేస్తుంటారు. తమకు అందుబాటులో ఉండే ఆహారాలను వారు తింటుంటారు. ఇడ్లీ, దోశ, పూరీ వంటి సంప్రదాయ ఆహారాలతోపాటు కొందరు పోషకాలు కలిగిన భిన్న రకాల ఆహారాలను ఉదయం బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా తింటారు. అయితే కొందరు బ్రేక్‌ఫాస్ట్‌ను మానేస్తుంటారు. ఏకంగా మధ్యాహ్నం లంచ్ చేస్తారు. ఉదయం సమయం లేదని లేదా కావాలనే కొందరు బ్రేక్ ఫాస్ట్ చేయడం మానేస్తుంటారు. అయితే ఈ అలవాటు మంచిది కాదని, మన ఆరోగ్యానికి అన్ని రకాలుగా కీడు చేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మానేయడం వల్ల అనేక దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వారు అంటున్నారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేయకపోతే దీర్ఘకాలంలో మన శరీరంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వారు అంటున్నారు.

షుగర్ లెవల్స్..

ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేయకపోవడం వల్ల దీర్ఘకాలంలో లో షుగర్ సమస్య ఏర్పడే అవకాశాలు ఉంటాయి. అప్పటికే ఆ సమస్య ఉన్నవారు బ్రేక్ ఫాస్ట్ చేయడం మానేస్తే ఇంకా తీవ్ర ప్రభావం ఉంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ మరింత పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. రాత్రి పూట భోజనం చేసిన తరువాత ఉదయం మళ్లీ బ్రేక్ ఫాస్ట్ చేసే వరకు చాలా సమయం ఉంటుంది. ఆ సమయంలో లివర్‌లో నిల్వ ఉండే గ్లూకోజ్ స్థాయిలు ఖర్చయిపోతాయి. ఈ క్రమంలో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేయకపోతే శరీరానికి గ్లూకోజ్ లభించదు. దీని కారణంగా శరీరం కొవ్వులపై ఆధార పడుతుంది. ఈ క్రమంలో షుగర్ లెవల్స్ విపరీతంగా పడిపోతాయి. కనుక ఈ సమస్య ఉత్పన్నం అవకుండా ఉండాలంటే ఉదయం కచ్చితంగా బ్రేక్ ఫాస్ట్‌ను చేయాల్సి ఉంటుంది.



అధిక బరువు..

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేయకపోతే శరీరంలో హార్మోన్ల సమతుల్యత దెబ్బ తింటుంది. దీని కారణంగా ఒత్తిడి హార్మోన్లయిన కార్టిసాల్ వంటివి ఉత్పత్తి అవుతాయి. దీంతో ఆకలిని పెంచే హార్మోన్ల ఉత్పత్తి కూడా పెరుగుతుంది. ఈ క్రమంలో విపరీతంగా ఆకలి అవుతుంది. దీని వల్ల రోజులో ఇతర సమయాల్లో కావల్సిన దాని కన్నా అధికంగా ఆహారం తింటారు. దీని వల్ల శరీరంలో క్యాలరీలు చేరి కొవ్వు పెరుగుతుంది. అధిక బరువు పెరుగుతారు. ఇలా ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేయకపోవడం అనే చర్య పరోక్షంగా అధిక బరువుకు కారణం అవుతుంది. కనుక ఉదయం కచ్చితంగా బ్రేక్ ఫాస్ట్ చేయాల్సి ఉంటుంది. ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేయకపోతే తలెత్తే మరో సమస్య మెటబాలిజం తగ్గిపోవడం. దీని కారణంగా శరీరం క్యాలరీలను సరిగ్గా ఖర్చు చేయదు. దీంతో కొవ్వు నిల్వలు పేరుకుపోయి అధికంగా బరువు పెరుగుతారు. ఈ విధంగా రెండు రకాలుగా బరువు పెరిగేందుకు అవకాశాలు ఉంటాయి. కనుక ఉదయం తప్పనిసరిగా అల్పాహారం తీసుకోవాలి.

ఇలా చేయండి..

చాలా మంది ఉదయం సమయం లేదని, లేదా ఆఫీస్‌కు ఆలస్యం అవుతుందని బ్రేక్ ఫాస్ట్ చేయడం మానేస్తుంటారు. కానీ అలా చేయకూడదు. కచ్చితంగా ఏదో ఒక ఆహారం తినాలి. ఇతర అల్పాహారాలను తయారు చేసేందుకు సమయం లేకపోతే కనీసం పండ్లు, ఉడకబెట్టిన గుడ్లు, విత్తనాలు, నట్స్ వంటి వాటిని తినాలి. ఇవి పోషకాలను అందించడమే కాదు, ఆకలి ఎక్కువగా అవకుండా చేస్తాయి. బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. ఇంకా అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా ప్రోటీన్లు ఉండే ఆహారాలను తింటే ఎంతో మేలు జరుగుతుంది. కోడిగుడ్లు, గింజలు, విత్తనాలను తింటే ఉపయోగం ఉంటుంది. వీటిని వండాల్సిన పనిలేదు. కేవలం గుడ్లను మాత్రం ఉడకబెడితే సరిపోతుంది. ఇతర పదార్థాలను రాత్రి పూట నీటిలో నానబెడితే చాలు, ఉదయం తినవచ్చు. ఇలా చాలా సులభంగా అల్పాహారం రెడీ అయిపోతుంది. దీన్ని తింటే అనేక లాభాలు కలుగుతాయి. కానీ ఎట్టి పరిస్థితిలోనూ బ్రేక్‌ఫాస్ట్‌ను మానేయకూడదు.

# విశాఖలో టీమిండియా రికార్డులు అద్భుతం.. ధోనీకి గుర్తింపు, రో-కో ఫైర్‌బ్రాండ్ ఇక్కడే!



స్పోర్ట్స్ న్యూస్, 05 డిసెంబర్ (తెలుగు గళం): వన్డే సిరీస్‌లో భాగంగా శనివారం (డిసెంబర్ 6) విశాఖపట్నంలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య మూడో మ్యాచ్ జరగనుంది. రాంచీ, రాయ్‌పూర్‌లో రెండు మ్యాచ్‌లు ముగియగా.. సిరీస్ 1-1తో సమంగా ఉంది. వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో మూడో మ్యాచ్ మధ్యాహ్నం 1.30కు ఆరంభం కానుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి.. సిరీస్ విజేతగా నిలవాలని ఇరు జట్లు భావిస్తున్నాయి. దాంతో మ్యాచ్ రసవత్తరంగా సాగనుంది. అయితే వైజాగ్‌లో భారత్‌కు ఉన్న ఏకైక ప్రయోజనం ఏమిటంటే.. అద్భుతమైన రికార్డు. అంతేకాదు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు రాణిస్తుండడం.

విశాఖ మైదానంలో టీమిండియా, ఆటగాళ్లకు అద్భుతమైన రికార్డు ఉంది. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 148 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది ఈ మైదానంలోనే. ప్రపంచం ముందుగా ధోనీ మార్క్ బ్యాటింగ్ చూసింది ఇక్కడే. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా ఈ మైదానంలో వన్డేల్లో భారీగా పరుగులు చేశారు. విశాఖ మైదానంలో ఇద్దరికీ అద్భుతమైన రికార్డులు ఉన్నాయి. ఇక్కడ భారత్ మొత్తం 10 మ్యాచ్‌లు ఆడింది. వాటిలో ఏడు మ్యాచ్‌ల్లో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. 2018 అక్టోబర్ 24న వెస్టిండీస్‌తో జరిగిన వన్డే టై అయింది.

విశాఖ మైదానంలో మొదటి వన్డే మ్యాచ్ 5 ఏప్రిల్ 2005న భారత్, పాకిస్తాన్ మధ్య జరిగింది. ఈ మ్యాచ్ చారిత్రాత్మకమైనది అనే చెప్పాలి. ఈ మ్యాచ్ ఎంఎస్ ధోనీకి ఐదవ వన్డే కాగా.. అతను మొదటిసారి మూడవ స్థానంలో బ్యాటింగ్ చేసి 123 బంతుల్లో 148 పరుగులు రన్స్ బాదారు. రెండు క్యాచ్‌లు కూడా అందుకున్నారు. ఈ మ్యాచ్ తర్వాత మహీ హీరో అయ్యారు. నిజానికి ధోనీ మొదటి నాలుగు వన్డేలు ఆకట్టుకోలేకపోయారు. 2004 డిసెంబర్ 23న చిట్టగాంగ్‌లో తొలి వన్డే ఆడగా.. పరుగులు చేయకుండానే రనౌట్ అయ్యారు. ఢాకాలో జరిగిన రెండవ మ్యాచ్‌లో 12 పరుగులు, మూడవ మ్యాచ్‌లో 7 పరుగులు చేశారు. కొచ్చిలో జరిగిన నాల్గవ వన్డేలో 3 పరుగులు చేశారు. వైజాగ్‌కు వచ్చిన తర్వాత మహీ కెరీర్ మారిపోయింది. ఏడు మ్యాచ్‌ల్లో 65.00 సగటు, 104.83 స్ట్రైక్ రేట్‌తో 260 పరుగులు చేశారు.

వైజాగ్‌లో పరుగులు చేయడంలో విరాట్ కోహ్లీకి సాటి ఎవరూ లేరు. ఇక్కడ 7 వన్డేలలో 587 పరుగులు చేశాడు. ఇందులో 3 సెంచరీలు, 2 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ మైదానంలో కింగ్ కోహ్లీ బ్యాటింగ్ సగటు 97.83 కాగా.. స్ట్రైక్ రేట్ 100.34. ఈ మైదానంలో అతని అత్యధిక స్కోరు 157 నాటౌట్. 24 అక్టోబర్ 2018న వెస్టిండీస్‌పై ఈ స్కోర్ చేశాడు. ఈ మైదానంలో అత్యధిక పరుగులు చేసిన రెండవ ఆటగాడు హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ. ఏడు మ్యాచ్‌ల్లో 355 పరుగులు చేశాడు. అందులో ఒక సెంచరీ, రెండు అర్ధ సెంచరీలు ఉన్నాయి. 59.16 సగటు, 99.43 స్ట్రైక్ రేట్‌తో రన్స్ చేశాడు. కుల్దీప్ యాదవ్ ఇక్కడ నాలుగు మ్యాచ్‌ల్లో తొమ్మిది వికెట్లు తీసుకున్నాడు.

# 4 మ్యాచ్‌లే ఆడతాం!.. ఐపీఎల్ వేలానికి ముందు విదేశీ ఆటగాళ్ల మెలిక

స్పోర్ట్స్ న్యూస్, 05 డిసెంబర్ (తెలుగు గళం): మరికొద్దిరోజుల్లో అబుదాబి వేదికగా నిర్వహించాల్సి ఉన్న ఐపీఎల్ వేలానికి ముందు పలువురు విదేశీ ఆటగాళ్లు తాము సీజన్ మొత్తానికి అందుబాటులో ఉండలేమని కొత్త మెలిక పెట్టారు. గత సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు ఆడిన జోష్ ఇంగ్లిస్.. 2026లో నాలుగు మ్యాచ్‌లు మాత్రమే ఆడతానని బీసీసీఐకి తెలిపాడు.




వేలంలో భారీ ధర పలుకుతాడని అంచనాలున్న ఇంగ్లిస్.. అన్ని తక్కువ మ్యాచ్‌లు ఆడితే అతడిమీద ఫ్రాంచైజీలు ఆసక్తిచూపుతాయా? అన్నది ఆసక్తికరం. ఇంగ్లిస్‌తో పాటు ఆసీస్‌కే చెందిన అగర్, సదర్లండ్, రిలీ రూసో సైతం తాము కొన్ని మ్యాచ్‌లే ఆడతామని బీసీసీఐకి తెలిపారు.

# ప్రపంచ కప్‌కు ముందే మెస్సీ రిటైర్? దిగ్గజ ఫుట్ బాల్ ప్లేయర్ సంచలన ప్రకటన!



స్పోర్ట్స్ న్యూస్, 05 డిసెంబర్ (తెలుగు గళం): లియోనల్ మెస్సీ ప్రపంచంలోని గొప్ప ఫుట్‌బాల్ ఆటగాళ్లలో ఒకడు. అతడి కెప్టెన్సీలోనే అర్జెంటీనా 2022 ఫిఫా వరల్డ్ కప్ గెలుచుకుంది. ఆ ఫైనల్లో అర్జెంటీనా, ఫ్రాన్స్‌ను పెనాల్టీ షూట్‌అవుట్‌లో ఓడించింది. ఇప్పటికీ మెస్సీ మంచి ఫామ్‌లోనే ఉన్నాడు. మెస్సీ నాయకత్వంలో అర్జెంటీనా వచ్చే వరల్డ్ కప్‌కు సైతం అర్హత సాధించింది. అయితే 2026 ఫిఫా వరల్డ్ కప్‌లో మెస్సీ ఆడతాడా? అనే ప్రశ్నకు కచ్చితమైన సమాధానం రావడం లేదు. 38 ఏళ్ల మెస్సీ కొన్ని సందర్భాల్లో వచ్చే వరల్డ్ కప్ ఆడతానా లేదా అన్న విషయంలో సందేహమే వ్యక్తం చేశాడు.

వాషింగ్టన్ డీసీలో జరగబోయే వరల్డ్ కప్ డ్రా ముందుగా.. ESPNకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశాడు. తాను వరల్డ్ కప్‌లో ఆడటం గురించి అర్జెంటీనా కోచ్ లియోనల్ స్కలోనీతో తరచూ మాట్లాడుతున్నానని తెలిపాడు. "నేను ఈ విషయంపై చాలా సార్లు చర్చించాం. స్కలోనీకి బాగా అర్థం చేసుకున్నాడు. నాకు అవకాశం ఉంటే మైదానంలో ఉంటాను. ఒక వేళ ఆడకపోయినా, వరల్డ్ కప్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా తప్పకుండా చూస్తాను. ఎందుకంటే వరల్డ్ కప్ ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైనదే. మా వంటి వాళ్లకు అయితే అది మరింత భావోద్వేగంగా అనిపిస్తుంది" అని వివరించాడు. మెస్సీ ప్రకటనతో ప్రపంచ కప్‌కు ముందే మెస్సీ రిటైర్ అవుతాడా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మెస్సీకి మ్యాచ్ ఆడాలని ఉన్నప్పటికీ కోచ్, బోర్డు తీసుకునే నిర్ణయంపై సందిగ్ధం నెలకొంది. గతంలోనూ ఈ వరల్డ్ కప్‌లో ఆడతారా? అనే ప్రశ్నలకు మెస్సీ సరైన సమాధానం ఇవ్వలేకపోయాడు. ఓ వైపు వరల్డ్ కప్ దగ్గరకు వస్తుంది. ఈ తరుణంలోనూ మెస్సీకి క్లారిటీ లేకపోవడం అభిమానులను గందరగోళానికి గురి చేస్తోంది.

# అర్ష్‌దీప్ గణాంకాలు సూపర్.. అవకాశాలు ఇస్తే మూడో ప్రధాన పేసరే!




స్పోర్ట్స్ న్యూస్, 05 డిసెంబర్ (తెలుగు గళం): ఇటీవలి కాలంలో టీమిండియా పేసర్ 'అర్ష్‌దీప్ సింగ్' పేరు బాగా వినిపిస్తోంది. టీ20, వన్డేలలో నిలకడగా రాణించడమే అందుకు కారణం. ముఖ్యంగా పొట్టి ఫార్మాట్‌లో అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. అంతేకాదు ఐసీసీ టోర్నీలలో కూడా రాణిస్తున్నాడు. టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్లో అర్ష్‌దీప్ అద్భుత స్పెల్ వేశాడు. తన 4 ఓవర్ల కోటాలో 20 రన్స్ మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్స్ పడగొట్టాడు. పొట్టి ఫార్మాట్లో 100 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి భారత బౌలర్ అతడే కావడం విశేషం. ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో కూడా రాణిస్తున్నాడు.

అర్ష్‌దీప్ సింగ్ రాంచి వన్డేలో 64 రన్స్ ఇచ్చి రెండు వికెట్స్ పడగొట్టాడు. రాయ్‌పూర్ వన్డేలో 54 పరుగులు ఇచ్చి రెండు వికెట్స్ తీశాడు. రాయ్‌పూర్‌లో ఆరంభ ఐదు ఓవర్లలో 20 రన్స్ కూడా ఇవ్వలేదు. తరువాతి ఓవర్లలో పరుగులు ఇచ్చుకున్నాడు. ఈ గణాంకాలు గొప్పగా అనిపించకపోవచ్చు కానీ.. దక్షిణాఫ్రికా స్కోరు 332, 362 చూస్తే మాత్రం బాగా బౌలింగ్ వేశాడు అని అనాల్సిందే. రెండు మ్యాచ్‌లలో అర్ష్‌దీప్ ఛేదనలో బౌలింగ్ చేశాడు. భారీగా మంచు కురుస్తున్నా.. ఏ దశలోనూ బ్యాటర్లకు తనపై ఆధిపత్యాన్ని ప్రదర్శించే అవకాశమివ్వలేదు. సహకారం లేని పిచ్‌పై టాప్ బ్యాటర్లను భారీగా రన్స్ చేయకుండా ఆపాడు.

జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్‌ల గైర్హాజరీలో అర్ష్‌దీప్ సింగ్ బాధ్యతాయుతంగా బౌలింగ్ చేశాడు. జట్టులో మరొకరు అతడికి సహకరించే ఉంటే.. భారత్ ఇప్పటికే సిరీస్‌ను సొంతం చేసుకుని ఉండేది. హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణలు ఓవర్‌కు పదికి పైగా పరుగులు ఇచ్చారు. రెండు వన్డేలలో అర్ష్‌దీప్ షార్ట్ పిచ్ బంతులతో పరుగులను కట్టడి చేశాడు. ఇటీవలి 10 మ్యాచ్‌ల్లో 16 వికెట్లు పడగొట్టగా, ఎకానమీ 5 మాత్రమే. అర్ష్‌దీప్ గణాంకాలు మెరుగ్గానే ఉన్నా.. వన్డేల్లో అతడికి తగినన్ని అవకాశాలు రాలేదు. 2022లో వన్డే అరంగేంట్ర చేసినా ఇప్పటివరకు 13 మ్యాచ్‌లే ఆడాడు. వన్డే ప్రపంచకప్ 2027 సమీపిస్తున్న నేపథ్యంలో అర్ష్‌దీప్‌కు మరిన్ని అవకాశాలు ఇస్తే.. బుమ్రా, సిరాజ్‌లకు బ్యాకప్‌గా ఉంటాడు.

# సినిమా న్యూస్



## టైటిల్ గెలవడంతో నా జీవితమే మారిపోయింది

### -ఐశ్వర్య రాయ్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఐశ్వర్య రాయ్ మొదల్‌గా వచ్చి మిస్ వరల్డ్ కీరిటాన్ని సొంతం చేసుకుంది. 1994లో అనుకోకుండా పాల్గొని ఏకంగా విన్నర్‌గా నిలిచారు. ఆ తర్వాత సినిమాలపై ఆసక్తితో ఇండస్ట్రీకి వచ్చిన ఆమె ఎన్నో సూపర్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంది. కానీ 'పొన్నియన్ సెల్వన్-2' సక్సెస్ తర్వాత నుంచి ఇండస్ట్రీకి దూరం అయింది. తాజాగా, రెడ్ సి ఫెస్టివల్‌లో బ్లాక్ అండ్ వైట్ డ్రెస్‌లో పాల్గొని ఎమోషనల్ కామెంట్స్ చేసింది. 1994లో మిస్ వరల్డ్ పోటీలను అందాల పోటీలా భావించలేదు, అలాగే టైటిల్ కూడా నాకే రావాలని అనుకోలేదు. అంతర్జాతీయ పోటీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం అదృష్టంగా భావించి పాల్గొన్నా అని చెప్పింది. ఆ సమయంలో భారతీయుల గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసని.. ఆ విషయం నన్ను చాలా ఆశ్చర్యపరిచిందని తెలిపింది.

అందుకే ఆ వేదికపై మన దేశం గొప్పతనాన్ని చెప్పాల్సి వచ్చిందని.. టైటిల్ గెలవడంతో తన జీవితమే మారిపోయిందని పేర్చొన్నారు. అలాగే తన ఇండస్ట్రీలో తొలినాళ్ల అనుభావాలు గుర్తు చేసుకుంది. మణిరత్నం దర్శకత్వంలో మొదటి సినిమా చేశాను. అదే సంవత్సరం బాలీవుడ్ నుంచి ఆఫర్లు వచ్చాయి. తర్వాత వరుస అవకాశాలు రావడం వల్ల ఈ స్థాయిలో ఉన్నానంటూ సంతోషం వ్యక్తం చేసింది. అంతేకాకుండా తన జీవితంలో 'దేవదాస్' మూవీ ఓ మైలురాయిగా నిలిచిపోతుందని అన్నారు. ప్రస్తుతం ఐశ్వర్య రాయ్ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక ఈ విషయం గురించి తెలుసుకున్న నెటిజన్లు సినిమా ఇండస్ట్రీకి రీఎంట్రీ ఎప్పుడొస్తావని ప్రశ్నిస్తున్నారు.

## 'షో మ్యాన్'గా రాబోతున్న ఆర్జీవీ..

### షాకింగ్ పోస్టర్ విడుదల చేసిన మేకర్స్




నిజ జీవితంలో 'షో మ్యాన్' అయిన సంచలన దర్శకుడు రాంగోపాల్ వర్మ టైటిల్ రోల్ ప్లే చేస్తున్న చిత్రం 'షో మ్యాన్'. ఈ మూవీ 'మ్యాడ్ మాన్స్టర్' ట్యాగ్ లైన్ రాబోతుంది. ప్రముఖ నటుడు సుమన్‌ఇందులో విలన్‌గా నటిస్తుండడం విశేషం. సుమన్ విలన్‌గా నటించిన రజినీకాంత్ చిత్రం 'శివాజీ' ఎంతటి సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాకు 'నూతన్' అనే నూతన దర్శకుడు ఈ చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నాడు. ఆర్జీవీతో ఇంతకుముందు 'ఐస్ క్రీమ్-1, ఐస్ క్రీమ్-2 చిత్రాలు నిర్మించి, ఆయనతో ప్రత్యేక అనుబంధం కలిగిన ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ... ఓ ప్రముఖ కార్పొరేట్ సంస్థతో కలిసి... భీమవరం టాకీస్ పతాకంపై ప్రొడక్షన్ 120గా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాంగోపాల్ వర్మకు అత్యంత ప్రీతిపాత్రమైన గ్యాంగ్ స్టర్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ కూడా స్టార్ట్ చేశారు.. సంక్రాంతికి ట్రైలర్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ తెలిపారు. రాంగోపాల్ వర్మ హీరోగా... సుమన్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

## పుష్ప-2కు ఏడాది..

### అల్లు అర్జున్ ఎమోషనల్ పోస్ట్

అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో నటించిన సీక్వెల్ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్ విడుదలై అప్పుడే ఏడాది పూర్తైంది. సుకుమార్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో డిసెంబర్ 5న వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్‌గా థియేటర్లలోకి వచ్చి రికార్డు వసూళ్లతో ట్రెండింగ్ టాపిక్‌గా నిలిచింది. పుష్ప 2 గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద భారీగా వసూలు చేసి.. ఇండియన్ ఫిలిం హిస్టరీలో అత్యధిక వసూళ్లు సాధించిన (జాతీయ) చిత్రంగా తన హోదాను పదిలం చేసుకుంది. అదనంగా పుష్ప 2 కోసం 20 నిమిషాల ప్రత్యేక కంటెంట్‌తో కూడిన రీలోడెడ్ వెర్షన్ ఇటీవల థియేటర్లలోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ వెర్షన్‌కు కూడా అభిమానులు, మూవీ లవర్స్ నుంచి మంచి స్పందన వచ్చింది.



అయితే.. పుష్ప-2 ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా అల్లు అర్జున్ సోషల్ మీడియాలో ఒక స్పెషల్ పిక్ ని షేర్ చేశాడు. పుష్ప 2 క్లైమాక్స్ పోర్షన్ లో దర్శకుడు సుకుమార్ తో కలిసి ఉన్న పిక్‌ని పంచుకున్నాడు. పుష్ప చిత్రం కోసం ఐదేళ్లు తాను, సినిమా యూనిట్ తో ప్రయాణం ఎప్పటికి మర్చిపోలేనిదని ఎమోషనల్ పోస్ట్ లో పేర్కొన్నాడు. "పుష్ప మా జీవితంలో ఐదేళ్లపాటు సాగిన మరువలేని ప్రయాణంగా నిలిచింది. ఈ మూవీపై ప్రేక్షకులు చూపించిన ప్రేమ, అభిమానం మాలో మరింత ధైర్యాన్ని ఇచ్చింది. ఈ చిత్రాన్ని ఒక అద్భుతంగా మార్చిన ప్రతిఒక్కరికీ మేము ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉంటాం. ఇంత గొప్ప టీంతో పనిచేయడం నాకు దక్కిన గొప్ప గౌరవం' అని సోషల్ మీడియా పోస్ట్‌లో బన్నీ రాసుకొచ్చాడు.

## అఖండ- 2 రిలీజ్ వాయిదాకి

### అసలు కారణం ఇదే




బాలయ్య - బోయపాటిల క్రేజీయెస్ట్ ఫిల్మ్ అఖండ 2 వాయిదా పండింది. చిత్ర నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ఫైనాన్స్ క్లియరెన్స్ రాకపోవడంతో మరి గంటల్లో రిలీజ్ అవుతుందనగా రిలీజ్ వాయిదా పడింది. టికెట్స్ బుక్ చేసుకున్న వారికి సైతం డబ్బులు తిరిగి చెల్లించారు. ఇండియాతో పాటు ఓవర్సీస్ లోను అఖండ 2 షోస్ క్యాన్సిల్ చేశారు. రిలీజ్ వాయిదా వేయడంతో నందమూరి ఫ్యాన్స్ ఆందోళనలో చెందుతున్నారు.

కాగా ఈ సినిమా వాయిదా పడడానికి అసలు కారణం సంకేతిక సమస్యలు కాదు. ఈ చిత్ర నిర్మాతలైన రామ్ ఆచంట, గోపి ఆచంట గతంలో 14 రీల్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో 1నేనొక్కడినే, ఆగడు వంటి సినిమాలను బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ ఎరోస్ నౌ తో బాగస్వామ్యంగా భారీ బడ్జెట్ తో నిర్మించింది. కానీ రెండు సినిమాలు కూడా దారుణంగా ప్లాప్ అయ్యాయి. అప్పటి నుండి 14 రీల్స్ కు ఈరోస్ నౌ మధ్య ఆర్థిక లావాదేవిలా విషయంలో ఇష్యూ నడుస్తోంది. ఈరోస్ కు రూ. 27. 8 కోట్ల రూపాయలు 14 రీల్స్ బకాయి ఉంది. ఈ వివాదాన్నీ పరిష్కరించచకుండా 14 రీల్స్ ప్లస్ అని మరొక బ్యానర్ పై సినిమాలు చేస్తున్నారు రామ్ ఆచంట, గోపి ఆచంట. కొన్ని సంవత్సరాలుగా సైలెంట్ గా ఉన్న ఈరోస్ ఇప్పుడు అదును చూసి 14 రీల్స్ మేకర్స్ పై మద్రాసు కోర్టులో కేసు వేసింది. ఈ కేసులో కోర్టు తీర్పు ఈరోస్ కు అనుకూలంగా రావడంతో అఖండ 2 రిలీజ్ ఆగింది.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.